
# ప్రజా తపన

prajathapana.com

*News that matters*

విజయం వరించిందని విర్రవీగకు,ఓటమి ఎదురైంది అని నిరాశచెందకు. విజయమే అంతమూకాదు ఓటమి తుది మెట్టూకాదు

స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 6 శనివారం 11 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల నిధులు విడుదల

## బటన్ నొక్కి విడుదల చేసిన సీఎం జగన్

**అమరావతి**

కొత్త జంటలకు శుభవార్త చెప్పారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు పేదలైన తల్లిదండ్రులకు భారం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న 'వైఎస్సార్ కల్యాణమస్తు', 'వైఎస్సార్ షాదీ తోఫా' పథకాల ఆర్థిక సాయాన్ని ఇవాళ లబ్ధిదారులకు అందించారు.. ఇవాళ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి అర్హులైన 4,536 మంది లబ్ధిదారులకు రూ.38.18 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు సీఎం జగన్.. గతేడాది అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31 మధ్య వివాహాలు చేసుకుని.. అర్హత ఉన్న వివిధ వర్గాలకు చెందిన యువతులకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది ప్రభుత్వం.. అక్టోబర్ ? డిసెంబర్ 2022 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 4,536 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 38.18 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు..ఇక, ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అక్టోబరు-డిసెంబర్ మధ్య పెళ్లిళ్లు చేసుకున్నవారికి దరఖాస్తు చేసుకోవడానికి ఒక నెలపాటు సమయం ఇచ్చామని.. ఫిబ్రవరిలో వెరిఫికేషన్ పూర్తిచేసి ఈరోజు నేరుగా వారికి నగదు జమచేస్తున్నాం అన్నారు.. సమాజంలో మార్పు తీసుకువచ్చే దిశగా పథకం అమలుచేస్తున్నాం. ప్రతి సంవత్సరంలో ప్రతీ త్రైమాసికానికి సంబంధించి ఇదే పద్ధతిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాం. గొప్ప చదువులతోనే పేదల రాతలు మారుతాయి. ఖర్చుకు వెనుకాడకుండా నిధులు ఖర్చు చేస్తున్నాము. పేదింటి ఆడబిడ్డలను చదువులో ప్రోత్సహించడం, బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మరోవైపు.. డ్రాపౌట్ రేటు తగ్గించడమే లక్ష్యంగా పథకం అమలు అవుతోంది. ఈ పథకం పొందాలంటే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణత తప్పనసరి చేశామని.. నా చెల్లెమ్మలకు 18 ఏళ్లు, నా తమ్ముళ్లకు 21 ఏళ్లుగా నిర్దేశించినట్టు ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేశారు.. పెళ్లిళ్ల కోసం కొంతకాలం ఆగొచ్చు కానీ చదువులు ఆగిపోకూడదు. అమ్మాయిలు చదువుల బాట పడితేనే సమాజం బాగుపడుతుంది. పదేళ్ల తర్వాత




పరిస్థితులు ఎలా ఉంటాయి? అన్న ఆలోచనతో మనం అడుగులు ముందుకేస్తున్నామని వెల్లడించారు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.అయితే, ఎస్సీలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద ఈ ప్రభుత్వం రూ. 1,00,000 సాయం, ఎస్సీలకు (కులాంతర వివాహం) చేసుకున్నవారికి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద ఈ ప్రభుత్వం రూ. 1,20,000 సాయం, ఎస్టీలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 1,00,000 సాయం, ఎస్టీలకు (కులాంతర వివాహం) చేసుకున్నవారికి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 1,20,000 సాయం, బీసీలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 50,000 సాయం, బీసీల్లో కులాంతర వివాహం చేసుకున్నవారికి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద ఈ ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ. 75,000, మైనార్టీలో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద ఈ ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ. 1,00,000, విభిన్న ప్రతిభావంతులుగా ఉన్నవారికి వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద ఈ ప్రభుత్వం అందిస్తున్న సాయం రూ. 1,50,000, భవన, ఇతర నిర్మాణ కార్మికుల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ. 40,000 సాయం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది ఏపీ ప్రభుత్వం.

# ఫోర్బ్స్ జాబితాలో కోనసీమ కుర్రాడు

**అమలాపురం :**

ప్రపంచంలో ఏ మారుమూల ప్రాంతంలో జన్మించినా ఏదైనా సాధించాలన్న తపన, పట్టుదల ఉంటే ఎంతటి స్థాయికైనా చేరుకోవచ్చని ఎంతో మంది నిరూపించారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి దేశం గర్వించదగ్గ నాయకులుగా, సైంటిస్ట్‌లగా, ఆవిష్కరణకర్తలుగాను ఎంతో మంది మహానుభావులు పేరు ప్రఖ్యాతులు సాధించారు. మన నేపథ్యం ఎక్కడ, ఏమిటి అన్నది కాదు కానీ మనం ఏం సాధించామన్నది ముఖ్యమని గుర్తెరగాలని

(మిగతా 2లో)



# ఇస్రో ఖాతాలో మరో విజయం

**నెల్లూరు**

ఇస్రో ఖాతాలో మరో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం నాడు సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ ఉదయం 9.18 గంటలకు ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వీ-డి2 ప్రయోగం విజయవంతమైంది. షార్ లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఎస్-ఎస్ఎల్వీ-డి2 రాకెట్ ను ప్రయోగించారు. . 2022 ఆగస్టు 7న ఇస్రో ప్రయోగాత్మకంగా నిర్మించి ప్రయోగించిన

(మిగతా 2లో)



# వెలుగులు నింపుతున్న ఆర్టీపీపీ

**కడప :**

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) వెలుగులు నింపుతోంది. ప్రధానంగా రాయలసీమ ప్రాంత ప్రజలకు లోఓల్టేజీ సమస్యలను కట్టడి చేస్తోంది. విద్యుత్ కోతలకు ఆస్కారం లేకుండా ఆరు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. 1650 మెగావాట్లు సామర్థ్యానికి గాను 1450 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఏడాదికి పైగా ఇంతటి సామర్థ్యంలో విద్యుత్ ఉత్పత్తి తీయలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లభిస్తోంది. ఒక్కో యూనిట్ 210 మెగావాట్లు సామర్థ్యంతో 5 యూనిట్లు ఆర్టీపీపీలో నెలకొల్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకటి, రెండవ యూనిట్లు నోచుకోగా, 3, 4, 5, 6 యూనిట్లు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూపుదిద్దుకున్నాయి. 6వ యూనిట్ 600 మెగావాట్లు సామర్థ్యంతో నెలకొల్పడంతో మొత్తంగా 1650 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడింది. కాగా 2014?19 టీడీపీ సర్కార్ హయాంలో తీవ్రమైన బొగ్గు కొరత ఏర్పడింది. ఆశించిన మేరకు విద్యుత్ ఉత్పాదన నోచుకోలేదు. ముందుచూపు లేకపోవడంతో టీడీపీ హయాంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నమైందని కార్మికులు



వివరిస్తున్నారు. కాగా ఏడాదిగా ఈ స్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం ప్రస్తుత ఉత్పత్తే అరుదు అని యంత్రాంగం వివరిస్తోంది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు దినదినాభివృద్ధి వేగంగా చోటుచేసుకుంది. ఎన్టీ రామారావు హయాంలో అంకురార్పణ చేసి, తొలి యూనిట్‌ను ప్రారంభించి, రెండవ యూనిట్ పనులు కొనసాగించారు. ఆ పనులను చంద్రబాబు సర్కార్ పూర్తి చేయించింది. దివంగత సీఎం వైఎస్ హయాంలో అత్యంత వేగంగా ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా 3, 4, 5, 6 యూనిట్లు వేగంగా నిర్మించారు. వెరశి ఆర్టీపీపీకి 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తీసుకవచ్చారు. తద్వారా లో ఓల్టేజీ సమస్యకు చెక్ పడింది. అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలంటే సుమారు రోజుకు 21 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కానున్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. టీడీపీ సర్కార్‌లో ఐదేళ్ల కాలంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నం కావడంతో ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ముందు చూపుతో వ్యవహరించింది. ఒకేసారి 6లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీకి చేరాయి. దాంతో బొగ్గు కొరత అనే సమస్యే లేకుండా పోయిందని కార్మికవర్గాలు చెబుతున్నారు. ప్రస్తుతం 42వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీలో సిద్ధంగా ఉన్నాయి.

# తెలుగువారికి తరిగిపోని మధురామృతం అందించిన గానగంధర్వుడు ఘంటసాల

## -నేడు ఆయన వర్ధంతి



ఈరోజు ఫిబ్రవరి 11 ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల మనకు పంచిన మధురామృతాన్ని మననం చేసుకుందాం. ఘంటసాల గానం వినగానే తెలుగువారి మది ఆనందసాగరంలో మునకలు వేస్తుంది. ఈ నాటికీ ఘంటసాల పాటతోనే తెలుగునాట ఎన్నో కోవెలలు మేలుకొలుపు పాడుతూ ఉన్నాయి. మాస్టారు గానం చేసిన భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు తెలుగువారికి సుపరిచితాలు. ఆ గళంలో జాలువారిన ప్రతీపదం అమృతమయం అవుతుందని తెలుగువారి విశ్వాసం. ఘంటసాల గాత్రం వెలువరించిన గీతాలు ఈ నాటికీ పరవశింప చేస్తూనే ఉన్నాయి... ముఖ్యంగా ఆయన పాడిన భక్తి గీతాలు ఎందరిలోనో ఆధ్యాత్మిక భావం నెలకొల్పుతున్నాయి.ఘంటశాల వెంకటేశ్వరరావు 1922 డిశంబర్ 4న గుడివాడ మండలం చౌటపల్లిలో ఘంటశాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుండే భజనలు, కీర్తనలు తండ్రి వెంట పాడుతూ ఉండేవారు. తండ్రి ఆశయం నెరవేర్చాలనే లక్ష్యంతో సంగీత గురుకులంలో చేరారు. అక్కడి కట్టుబాట్లను తట్టుకోలేక తిరిగి సొంత ఊరికి వచ్చేశారు. తెలిసిన కొందరు సంగీత విద్వాంసుల ఇళ్ళలో పని చేస్తూ సంగీతం అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పని ఒత్తిడి పెరగడంతో ఆయన సంగీత కళాశాలలో చేరాలని అనుకున్నారు. 40 రూపాయలు విలువ చేసే ఉంగరాన్ని కేవలం రూ.8రూపాయలకు అమ్మి ఆంధ్రలో ఏకైక సంగీత కళాశాలలో చేరారు. అక్కడ ఉంటూ రోజుకు ఒక్కపూట భోజనం చేస్తూ అద్దె కట్టేందుకు డబ్బు లేక ఆ ఊళ్ళో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో తలదాచుకునేవారు. తరచూ ఆ గుడికి వచ్చే పట్రాయని సీతారామశాస్త్రి ఘంటశాల గురించి తెలుసుకుని తన ఇంట ఉచితంగా సంగీత శిక్షణనివ్వడానికి అంగీకరించారు. శాస్త్రి చాలా పేదవారు కావడంతో భోజన వసతి కల్పించడానికి చాలా ఇబ్బందులు పడేవారు. 1942లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాలు అలీపూర్ జైల్లో జైలు శిక్ష అనుభవించారు. 1944 మార్చి4న సావిత్రమ్మతో పెళ్ళి జరిగింది. తన పెళ్ళిలో తనే కచేరి చేసి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు ఘంటసాల. ఘంటశాలలోని గాన సామర్థ్యాన్ని గుర్తించిన సముద్రాల నాటి మద్రాసులోని రేణుకా ఫిలింస్కు తీసుకువెళ్ళి చిత్తూరు నాగయ్య, బి.ఎన్ రెడ్డిలకు ఎదుట పాటకచ్చేరీ చేయించారు. తరువాత ఘంటశాల తన మకాంను పానగల్ పార్కు వాచ్మెన్కు నెలకు రూ.2/-లు ఇచ్చే ఒప్పందం చేసుకుని అక్కడకు మార్చారు. పగలంతా అవకాశాల కోసం వెతికి రాత్రికి పార్కులో నిద్రించేవారు. చివరికి సముద్రాల అప్పటి మద్రాసు రేడియో కేంద్రంలో లలిత గీతాల గాయకుడి అవకాశాన్ని ఇప్పించారు. పాటలు పాడుతూ సినీరంగంలో చిన్న చిన్న వేషాలు వేసేవారు. 1947లో లక్ష్మమ్మ చిత్రానికి సంగీత దర్శకునిగా మారారు. 100 సినిమాలకు పైగా సంగీత దర్శకత్వం వహించారు. కొన్ని చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహించారు. 1969-72 మధ్యకాలంలో తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన గాయకునిగా కొనసాగారు. 1970లో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించింది. 1969 నుంచి తరచూ ఘంటశాల అనారోగ్యానికి గురయ్యేవారు. 1971లో ఐరోపా, ఆమెరికాలో ప్రదర్శనలు ఇస్తున్న సమయంలో ఘంటశాలకు గుండెనొప్పి వచ్చింది. హుటాహుటీన అక్కడి ఆసుపత్రికి తరలించారు. అప్పుడే ఆయనకు భగవద్గీత పాడాలనే కోరిక కలిగింది. భగవద్గీత పూర్తి చేసి సినిమా పాటలు పాడుకూడదని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత 1972లో భక్త తుకారాం, జీవన తరంగాలు, దేవుడు చేసిన మనుషులు వంటి హిట్ చిత్రాలకు పాటలు పాడారు. 1972లో రవీంద్రభారతిలో ప్రదర్శన ఇస్తున్నపుడు గుండెనొప్పి అనిపించడంతో హాస్పిటల్లో చేరాడు. అప్పటికే మధుమేహంతో బాధపడుతూ ఉన్నారు. చాలారోజులు చికిత్స అనంతరం హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యారు. అప్పుడే ఆయనకు భగవద్గీత పాడాలన్న కోరిక కలిగింది. భగవద్గీత పూర్తిచేసిన తర్వాత సినిమా పాటలు పాడకూడదు అనుకున్నారు. 1974 నాటికి అతను ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. చివరికి 1974 ఫిబ్రవరి 11న ఆస్పత్రిలో కన్నుమూసారు.

## తవ్వా కు రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యునిగా నియామక పత్రం అందజేత..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యునిగా డాక్టర్ తవ్వా వెంకటయ్య కు గురువారం తాడేపల్లి లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్ భార్గవ నియామక పత్రాన్ని అందజేశారు.
వెంకటయ్య ఈ హోదాలో రెండేళ్ల పాటు కొనసాగలు ఉన్నారు.గురువారం ఆయన విధులకు హాజరయ్యారు

ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి, తెలుగు భాష ఉన్నతికి, అంకితభావంతో అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు..



## "గృహ సారథులకు" శిక్షణ కార్యక్రమం

**హిందూపురం**



పట్టణ పరిధిలోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 1-19 వార్డులకు సంబంధించి అన్ని సచివాలయాల పరిధిలో నూతనంగా ఎంపిక చేసిన "గృహ సారథులకు" శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ &నియోజకవర్గ ఇంచార్జ్ "మహమ్మద్ ఇక్బాల్"
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత గృహ సారథుల పై ఉందని, మీరందరూ ప్రతి ఒక్క ఇంటి దగ్గరికి వెళ్లి ప్రజల నుండీ సలహాలు, సూచనలు మరియు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, "మా నమ్మకం - నువ్వే జగన్" అనే నినాదం ప్రజల్లో నాటుకుపోయేలా పనిచేయాలని అన్నారు..
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబిఉల్లా, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## మొదటి సంవత్సర విద్యార్థులకు ప్రెషర్స్ డే



ఆంధ్రవిశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు ఈ నెల 15 వ తారీఖున యం ఏ తెలుగు మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు స్వాగత వేడుకలను ఏర్పాటుచేసినట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలియజేసారు. రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు ప్రెషర్స్ డే ని ఏర్పాటు చేసుకుంటూ నూతన పంథాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు శాఖాధిపతి తెలియజేసారు.నూతన విద్యార్థులలో ఉన్న భయాందోళనలను తొలగిస్తూ వారిలో శారీరక మానసిక ఉల్లాసానికి నాందీ పలుకుతూ ఆటపాటల కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించినట్లు వెల్లడిచేసారు. విద్యార్థులకు కుర్చీపోటీలు,బేలూన్ ఊది గ్లాసులు ఎవరు ఏక్కువగా తీసుకువస్తారో వారే విజేతలుగా,డస్టర్ గేమ్ వంటి శారీరక ఆలోచనాత్మక ఆటలతో ఉల్లాసభరితంగా పోటీలు జరిగినట్లు సీనియర్స్ జూనియర్స్ అనే భేదం లేకుండా అంతా ఒక్కటైపోయి పోటీతత్వంతో ఎవరికి వారే సాటి మేటి అనేరీతిలో కార్యక్రమాలు నిర్వహించుకున్నారని తద్వారా వారిలో స్నేహామాధుర్యాలు పెంపొందటానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయనీ తెలియజేసారు



## ఫోర్బ్స్ జాబితాలో కోనసీమ కుర్రాడు

(మొదటిపేజీ తరువాయి)

అబ్దుల్ కలాం లాంటి గొప్ప శాస్త్రవేత్తలు చెప్పిన సందర్భాలు అనేక ఉన్నాయి. అలాంటి ఘనతే సాధించాడు ద్రాక్షారామానికి చెందిన యువకుడు. ఫోర్బ్స్ ప్రకటించిన అత్యంత ప్రతిభావంతుల జాబితాలో చోటు దక్కించుకోవడం అంటే అది ఆ గౌరవం పొందిన వ్యక్తికే కాదు తాను పుట్టిన ప్రాంతానికి కూడా గర్వకారణమే. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామానికి చెందిన ఓ యువకుడు తాజాగా ఫోర్బ్స్ ప్రకటించిన యంగ్ అచీవర్స్ 30 మంది జాబితాలో చోటుదక్కించుకున్నాడు. కాకిలేటి సూరిబాబు కుమారుడు కాకిలేటి శివతేజ రొమ్ము క్యాన్సర్ను గుర్తించే ప్రాజెక్ట్పై పరిశోధనలు చేస్తున్నారు. ఐఐటీ గుహవాటిలో ఈసీఈతో పాటు సీఎస్ఈ మైనర్ డిగ్రీ ఏకకాలంలో పూర్తి చేసిన శివతేజ బెంగుళూరులోని నిరమయ్ హెల్త్ ఎనలిటిక్స్ అనే మెడికల్ సాఫ్ట్వేర్ కంపెనీను మరికొంతమంది భాగస్వామ్యంతో ప్రారంభించి రొమ్ము క్యాన్సర్ ను గుర్తించే ప్రాజెక్టుపై పరిశోధనలు చేస్తున్నారు. ఈ సంస్థకు శివతేజ డైరెక్టర్, రీసెర్చ్ ప్రిన్సిపాల్, డేటా సైంటిస్ట్ గా వ్యవహరిస్తున్నారు. దీంతోపాటు నెదర్లాండ్స్లో మాస్ట్రక్ట్ విశ్వవిద్యాలయంలో క్లీనికల్ డేటా సైన్స్లో పీహెచ్డీ పూర్తిచేశారు. శివతేజ ఈ విభాగంలో ఇప్పటికే 25కు పైగా అంతర్జాతీయ రచనలు చేయగా వాటిలో 23కు పైగా పేటెంట్ హక్కులు లభించాయి. రొమ్ము క్యాన్సర్ను గుర్తించే ప్రాజెక్టుకు సంబంధించి మెషీన్ లెర్నింగ్ బృందానికి శివతేజ టీమ్లీడర్గా వ్యవహరిస్తున్నారు. మెడికల్ ఇమేజింగ్లో మంచి అనుభవం సాధించిన శివతేజ పరిశోధనలకు మంచి గుర్తింపు లభించడంతో తాజాగా ఫోర్బ్స్ పత్రిక యంగ్ అచీవర్స్ జాబితాలో స్థానం కల్పించింది. దీంతో శివతేజ స్వగ్రామం ద్రాక్షారామలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతుండగా తల్లిదండ్రులను స్థానికులు అభినందిస్తున్నారు.

## మన ఊరు మనబడి పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జగిత్యాల,**

విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు.. మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థినీ ,విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు జిల్లాలో కార్యక్రమం మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితరగతిన పూర్తి చేయాలనిజడ్పీ చైర్ పర్సన్ దావ వసంత -సురేష్ అన్నారు..శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మన ఊరు మన బడి కార్యక్రమం పై జడ్పీ చైర్ పర్సన్ అధికారులతో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూపేద విద్యార్థులకు ప్రైవేటుకు ధీటుగా మెరుగైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా చేపడుతున్న పాఠశాలల పునరుద్ధరణలో నాణ్యత ప్రమాణాలు పాటించి, జిల్లాలోని పాఠశాలలో విద్యుత్, మంచి నీరు, ఫర్నీచర్ , భోజనాశాలలు, మూత్రశాలలు వంటశాలలు , ప్రహరీ గోడలు అదనపు గదులు, డిజిటైలేషన్ మొదలగు వాటిని సమకూర్చి మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలన్నారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ రేటు పెరిగిందని విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన దిశగా చర్యలు తీసుకోవాలని,జిల్లాలోని ప్రజా ప్రతినిధులు సొంత కార్యక్రమంగా భావించి పని చేయాలని జడ్పీ ఛైర్మన్ సూచించారు. మంజూరి అయిన అన్ని పనులను మే 15 లోగా పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు .



ఈ సమావేశంలో సీఈఓ రామానుజాచార్యులు, డి.ఇ.ఓ జగన్ మోహన్ రెడ్డి, విద్యాశాఖఅధికారులు , ఈఈలు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు .

## ఇస్రో ఖాతాలో మరో విజయం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్ఎస్ఎల్వి-డి 1 రాకెట్ సాంకేతిక కారణాలతో విఫలమైని సంగతి తెలిసిందే. అది ఉపగ్రహాల్ని కక్షలోకి ప్రవేశపెట్టలేకపోయింది. తాజాగా లోపాల్ని సరిదిద్ది ఎస్ఎస్ఎల్వి-డి2 రాకెట్ రూపొందించి ప్రయోగించారు. 6.30 గంటలపాటు కౌంట్ డౌన్ కొనసాగిన అనంతరం రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిప్పులు చిమ్ముకుంటు నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ మూడు ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఎస్-ఎస్ఎల్వి-డి2 రాకెట్ 334 కిలోల బరువుండే మూడు రాకెట్లతో నింగిలోకి దూసుకెళ్లింది.ఇందులో రెండు దేశీయ ఉపగ్రహాలు కాగా, అమెరికాకు చెందిన ఓ ఉపగ్రహం ఉంది. వీటిని 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ప్రవేశపెట్టింది. తొలి ఉపగ్రహమైన ఈవోఎస్-07ను 785 సెకన్లకు, రెండోదైన జానుస్-1ను 880 సెకన్లకు, చివరిదైన ఆజాదీశాట్ను 900 సెకన్లకు వరుసగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలోని ఈవోఎస్-07 ఉపగ్రహాన్ని ఇస్రో రూపొందించింది. దీని బరువు 156.3 కేజీలు. అలాగే, ఆజాదీశాట్-2 ఉపగ్రహాన్ని చెన్నై స్పేస్కిడ్జ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు రూపొందించారు. దీని బరువు 8.7 కేజీలు. ఇక, జానుస్-1ను అమెరికాకు చెందిన అంటారిస్ సంస్థ అభివృద్ధి చేసింది. దీని బరువు 11.5 కేజీలు. తక్కువ ఖర్చుతో ప్రపంచ దేశాలుకు సంబంధించిన చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన ఘనత ఇస్రో సాధించినట్లయింది.

# మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రతి వ్యూహాన్ని రెడీ చేస్తున్న టీడీపీ

**విజయవాడ :**

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఓట్లు చీలిపోకుండా వైఎస్ఆర్‌సీపీ గుమ్మానికి స్టిక్కర్ కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. అందులో మా నమ్మకం నువ్వే జగన్ అనే స్లోగన్‌తో ప్రజలను ఆకట్టుకునే వ్యూహంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. అయితే దీనికి కౌంటర్‌గా తెలుగుదేశం ప్రతి వ్యూహాన్ని రెడీ చేసిందని టాక్ నడుస్తోంది. చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన టీడీపీ స్ట్రాటజి కమిటి ఓ నిర్ణయాన్ని తీసుకుందని తెలుస్తోంది. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసే దిశగా అమరావతిలో స్ట్రాటజీ కమిటీ మీటింగ్ జరిగింది. పార్టీ శ్రేణులను ముందస్తుకు సిద్ధం చేయాలని పార్టీ సీనియర్లు నిర్ణయించారు. వచ్చే ఎన్నికలకు సన్నద్ధం అయ్యే క్రమంలో అధికార పార్టీ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని చెప్పుకుంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు అదే స్థాయిలో కౌంటర్ ఇవ్వాలని తెలుగు దేశం భావిస్తోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్న లెక్కలతోనే కౌంటర్ అటాక్ చేయాలని వ్యూహం రెడీ చేస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయటం, ఇవ్వని హామీలను కూడా అమలు చేశాం కాబట్టి ఓటు అడిగే హక్కు తమకే ఉందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించటంతోపాటుగా ప్రతి ఇంటికి పార్టీ స్టిక్కర్ అంటించాలని భావిస్తున్నారు. అయితే అదే సమయంలో తెలుగుదేశం నేతలు కూడా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ఎంత ఇచ్చింది, ప్రజలపై ఎంత భారం మోపిందనే విషయాలను వివరించాలని భావిస్తున్నారు. దీంతోపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని టీడీపీ స్ట్రాటజి కమిటి సమావేశంలో నిర్ణయించారు. జగన్ సర్కార్ ముందస్తుకు సిద్ధమవుతోందని తెలుగుదేశం స్ట్రాటజీ కమిటీ అంచనా వేసింది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని భావిస్తోంది. లోకేష్ ఒక వైపు పాదయాత్ర చేస్తుంటే మరోవైపున జనసేన అదినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రకు రెడీ అవుతున్నారు. దీంతోపాటు ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల్లో విభేదాలు బయటపడుతున్నాయి. అదే సమయంలో వివేకా హత్యకేసు వ్యవహారం, రాజధాని వంటి అంశాలు అధికార పార్టీపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అన్నింటికీ మించి ఖజానా నిండుకుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వీలైనంత వరకు డబ్బులను పంచి పెట్టి ఎప్పుడైనా జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్తారని తెలుగు దేశం పార్టీ భావిస్తుంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొవాలని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, మోసాలు, ప్రజలకు వివరించి తిరిగి తెలుగు దేశం జెండాను ఎగర వేయాలని శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి 35 నియోజకవర్గాలను జోన్ గా విభజించి, పార్టీ నాయకులు కార్యకర్తలను సమాయత్తం చేయాలని టీడీపీ స్ట్రాటజి కమిటి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పారు. ముందస్తు ఎన్నికలపై పార్టీ క్యాడర్‌ను అలర్ట్ చేసి, అధికర పక్షానికి దీటుగా బదులు ఇచ్చేందుకు ఇంటింటికి వెళ్ళి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని అధినేత పిలుపు నిచ్చారని అచ్చెం చెప్పారు. లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం భయపడింది కాబట్టే అడుగడుగునా అడ్డంకులను కలిగిస్తున్నారని, పోలీసుల వైఫల్యాలపై పోరాటం చేయాలని ఆయన అన్నారు.

# ఆగని మైలవరం పంచాయితీ

**విజయవాడ :**

గత కొద్దిరోజులుగా మైలవరం నియోజకవర్గం వైసీపీ నేతల మధ్య నెలకొన్న విభేదాలపై నేడు ముఖ్యమంత్రి జగన్ నేరుగా దృష్టి పెట్టనున్నారు. ఈరోజు సాయంత్రం మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ముఖ్యమంత్రి జగన్ ను కలవనున్నారు. ఈ మేరకు అపాయింట్‌మెంట్ లభించింది. వసంత కృష్ణప్రసాద్ తో నేరుగా మాట్లాడి మైలవరం నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి నేరుగా చర్చించనున్నారు. మైలవరం పంచాయతీ... గత కొంతకాలంగా మంత్రి జోగిరమేష్, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అనుచరుల మధ్య పెద్ద యుద్ధమే జరుగుతుంది. 2014 ఎన్నికల్లో మైలవరంలో పోటీ చేసి ఓటమి పాలయిన జోగి రమేష్ ఇప్పటికీ తన అనుచరులకు అక్కడ పదవులు దక్కాలని కోరుకుంటున్నారు. వసంత కృష్ణప్రసాద్ కూడా అందరినీ కలుపుకుని పోకుండా జోగి రమేష్ అనుచరులను వేరుగా చూడటం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. గతంలో ఈ వివాదాలపై ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వద్ద పంచాయతీ జరిగింది. అయినా వివాదం కొలిక్కి రాలేదు. సోషల్ మీడియాలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు బురద జల్లుకునే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నాయి. దీంతో పార్టీకి ఇబ్బందిగా మారుతుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే మరింత డ్యామేజీ అయ్యే అవకాశముందని భావించి నేరుగా ముఖ్య మంత్రి జగన్ రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్. మొన్నామధ్య.. . గుంటూరు తొక్కిసలాట ఘటనలో అరెస్టైన ఉయ్యూరు శ్రీనివాస్‌కి మద్దతుగా కామెంట్స్ చేశారు. అంతేకాదు 10 , 15 మంది చీడ, పీడల వల్లే పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయని తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉండాలంటే చుట్టూ పది మంది పోరంబోకుల్ని ఉంచుకోవాలని తీవ్ర కామెంట్స్ చేశారు. ప్రతిపక్షంలో కాదు, స్వపక్షంలో ఉంటూ.. వెన్నుపోటు పొడిచేవారిని సహించేది లేదని తేల్చి చెప్పారు.ఇక వీరసింహారెడ్డి రిలీజ్ సందర్భంగా హీరో బాలకృష్ణ ఫోటోలతో పాటు అన్న ఎన్టీఆర్ ఫోటో కూడా ప్రింట్ చేయించి మరో ఆసక్తికర చర్చకు దారి తీశారు.మరి ఇప్పటికైనా సమస్య పరిష్కారం అవుతుందా? లేదా? అన్నది చూడాలి.

# పక్కా ప్లాన్ తో పీఎఫ్ ఐ

**ముంబై :**

మహారాష్ట్రలోని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ పాపులర్ ఫ్రంట్ ఇండియా కి చెందిన 5గురు నిందితులను గతేడాది సెప్టెంబర్‌లో అరెస్ట్ చేసింది. కేంద్రం ఆ సంస్థపై నిషేధం కూడా విధించింది. అయితే..ఇప్పుడు ఈ కేసుకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏటీఎస్ ఈ ఐదుగురిపై ఓ చార్జ్‌షీట్ తయారు చేసింది. ఇందులో అత్యంత సంచలనంగా మారిన విషయం ఒకటుంది. 2047 నాటికి ఇండియాను ఇస్లామిక్ కంట్రీగా మార్చాలని పీఎఫ్ఐ ప్లాన్ చేసినట్టు అందులో ప్రస్తావించారు. నిందితుల్లో ఒకరైన మజర్ మన్సూర్ ఖాన్‌ను విచారించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2047 నాటికల్లా భారత్‌ను ముస్లిం దేశంగా మార్చేందుకు ఎలా ప్లాన్ చేయాలో మొత్తం రూట్ మ్యాప్‌ను సిద్దం చేసుకున్నట్టు చెప్పారు. మొత్తం 7 పేజీలున్న ఈ పీడీఎఫ్‌లో మరెన్నో సంచలన విషయాలున్నాయి. భారత్‌లో 70% మంది ముస్లింలే ఉన్నారంటూ విచారణలో నిందితులు చెప్పారు. 2047 నాటికి 100% మంది ముస్లింలే ఉంటారని...అప్పుడు ఇండియాను కూడా ఇస్లామిక్ దేశంగా ప్రకటించొచ్చని వాళ్లు వివరించినట్టు ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు.

విచారణలో ఏం చెప్పారంటే..?

1. ముస్లింల సంక్షేమం కోసం ఆలోచించే వాళ్లంతా పిఎఫ్ఐతో కలిసి పని చేయాలి. ముస్లింలకు భారత్‌లో ఎంత అన్యాయం జరుగుతోందో వివరించాలి. అవసరమైనప్పుడల్లా కత్తులు, రాడ్‌లతో దాడులు చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేశారు.
2. హింసాత్మక ఘటనలతో అందరినీ భయభ్రాంతులకు గురి చేయాలి. క్రమంగా పిఎఫ్ఐ బలాన్ని పెంచాలి. కఠినమైన శిక్షణ అందించాలి. ఖీూా సహా మరి కొన్ని హిందూ సంస్థల మధ్య చిచ్చు పెట్టాలి.
3. ఎస్సీ, ఎస్టీల మద్దతు కూడగట్టుకునేందుకు ముస్లిం అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలి. ఆ గెలిచిన అభ్యర్థులు పిఎఫ్ఐని బలోపేతం చేసేందుకు సహకరించాలి. ఈ వెనకబడిన వర్గాల కోసం ముస్లింలందరూ కలిసి ప్రత్యేకంగా ఓ సంఘాన్ని ఏర్పాటు చేసి అండగా నిలబడాలి.
4. ముస్లిం సంస్థలన్నీ ఒకే గొడుగు కిందకు రావాలి. ఈ సంస్థలకు విధేయంగా ఉన్న వారికే ఉన్నత పదవులు ఇవ్వాలి.

భారత్‌లో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సంస్థపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. పీఎఫ్ఐ సహా దాని అనుబంధ సంస్థలను ఐదేళ్ల పాటు బ్యాన్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఆ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. పీఎఫ్ఐ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నందుకే ఆ సంస్థపై ఈ నిషేధం విధిస్తున్నట్లుగా ఉత్తర్వుల్లో కారణంగా పేర్కొన్నారు. గత కొద్ది రోజుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పీఎఫ్ఐ సంస్థ కార్యకలాపాలపై ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాలు సహా దేశ వ్యాప్తంగా పీఎఫ్ఐ సంస్థ కార్యాలయాలు సహా సభ్యుల ఇళ్లపై వరుస సోదాలు నిర్వహించింది. ఇప్పటికే ఎన్ఐఏ పలువురు పీఎఫ్ఐ లీడర్లను అరెస్టు కూడా చేసింది. దేశంలో మొత్తం 8 రాష్ట్రాల్లో పిఎఫ్ఐ సంస్థతో సంబంధం ఉన్న అనేక మంది వ్యక్తులు, సంస్థ ఆఫీసుల్లో సోదాలు కొనసాగాయి.. యూపీ, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, ఢిల్లీ, కర్ణాటక, గుజరాత్, అసోంలో ఈ దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్ లో ఇంటలిజెన్స్ బ్యూరోతో పాటు సోదాలు జరిగిన రాష్ట్రాల పోలీసులు కూడా సాయం చేశారు.

# క్లైమాక్స్ కు చేరిన క్యాపిటల్ స్టోరీ

**విజయవాడ :**

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే రాజధాని అంశంపై రగడ నడుస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రం విడిపోయాక ఏపీలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు..అమరావతిని రాజధానిగా పెట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న జగన్ కూడా ఓకే చెప్పారు. ఇక 2019 ఎన్నికల్లో రాజధాని మార్పుపై జగన్ ఎలాంటి ప్రకటన చేయలేదు.కానీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల కాన్సెప్ట్ తెచ్చారు. అమరావతిని శాసన రాజధానిగా, విశాఖని ఎగ్జిక్యూటివ్ రాజధానిగా, కర్నూలుని న్యాయ రాజధానిగా చేస్తామని చెప్పారు.చెప్పి మూడున్నర ఏళ్ళు అవుతుంది..అయినా రాజధాని అంశం అలాగే ఉంది. చివరికి రాష్ట్రానికి రాజధాని ఏదో చెప్పలేని పరిస్తితి. అయితే ఇప్పటికే ఈ రాజధాని అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉంది. అతి త్వరలోనే రాజధానిపై సుప్రీం కోర్టు తేల్చేసే అవకాశం ఉంది.అయితే సుప్రీం తీర్పు తమకే అనుకూలంగా ఉంటుందని వైసీపీ భావిస్తుంది. అందుకే విశాఖకు వెళ్ళేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. అక్కడ నుంచే పాలన మొదలుపెట్టడానికి రెడీ అవుతున్నారు.ఇప్పటికే హైకోర్టు రాజధాని మార్చడానికి లేదని చెప్పిందని, సుప్రీం కోర్టు కూడా అదే చెబుతుందని ప్రతిపక్ష టిడిపి, అమరావతి రైతులు ధీమాగా ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వం సైతం అమరావతినే రాజధానిగా పరిగణిస్తుంది. బిజేపి సైతం అమరావతికే మద్ధతు ఇస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాజధాని అంశంపై ఎలాంటి మలుపులు చోటు చేసుకుంటాయో చూడాలి.అయితే పేరుకు మూడు రాజధానులు అని చెబుతున్నా సరే జగన్ ప్రభుత్వం అసలు కాన్సెప్ట్ విశాఖ రాజధాని అని చెప్పవచ్చు. అందుకే విశాఖ రాజధాని అని చెప్పి వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇక అసెంబ్లీ ఎక్కడ ఉన్నా, హైకోర్టు ఎక్కడ ఉన్నా విశాఖ అసలు రాజధాని అనే కాన్సెప్ట్ తో ముందుకెళుతున్నారు. మరి రాజధానిపై కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో చూడాలి. అలాగే నెక్స్ట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో చూడాలి.

# సర్కారీ స్కూళ్లకు కార్పొరేట్ యూనిఫామ్...

**హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుంది. అటు అభివృద్ధికి, ఇటు సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. విద్య, వైద్యంపై సీఎం కేసీఆర్ ప్రధాన ఫోకస్ పెట్టారు. మంత్రి హరీశ్ రావు నేతృత్వంతో వైద్యారోగ్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెరిగాయి. సుస్తి చేస్తే సర్కారీ దవాఖాను పోయి చూపించుకుంటున్నారు జనం. ఇటు విద్యారంగంలో కూడా పెను మార్పులు వస్తున్నాయి. కార్పోరేట్ స్కూళ్లకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇక వచ్చే విద్యా సంవత్సరం నుంచి కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగానే సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్ అందించాలని పాఠశాల విద్యాశాఖ డిసైడయ్యింది. 5 కొత్త డిజైన్లతో పిల్లలకు యూనిఫామ్స్ ఇవ్వనున్నారు. ఎనిమిది నుంచి ఆపై తరగతుల అబ్బాయిలకు ప్యాంట్లు, కింది తరగతుల వారికి నిక్కర్లు ఉంటాయి. 1 నుండి 3 తరగతి వరకు ఉన్న బాలికలకు చెక్డ్ షర్ట్, రెండు జేబులతో కూడిన మెరూన్ స్కర్ట్ ఉంటుంది. ఆపై తరగతుల వారికి కుర్తా, మెరూన్ పైజామాపై మెరూన్ వెయిస్ట్‌కోట్ ఉంటుంది. మొత్తం 26 వేల స్కూళ్లలోని 25 లక్షల స్టూడెంట్స్‌కు యూనిఫామ్ అందించనున్నారు. ఇందుకోసం సుమారు రూ. 145 కోట్లు ఖర్చు చేస్తుంది ప్రభుత్వం. -8 క్లాసుల స్టూడెంట్స్‌కు అయ్యే వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 రేషియోలో ఖర్చును భరిస్తాయి. తొమ్మిది, పది తరగతుల వారితోపాటు ఐఉఃఎ, ఆదర్శ పాఠశాలల్లో 12వ తరగతి వరకు స్టూడెంట్స్‌కు పూర్తిగా రాష్ట్ర నిధులతో ఇస్తారు. తెలంగాణ రాష్ట్రంలో పదివేల ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. స్థానిక సంస్థల నుంచి లైబ్రరీ సెస్సు బకాయిల వసూలుపై దృష్టి సారిస్తామని చెప్పారు. మండలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'మన ఊరు-మనబడి' కార్యక్రమం కోసం మొత్తం రూ. 7,289.54 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం మూడు విడతల్లో 26,065 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదువుపాయాలను కల్పించనున్నామని పేర్కొన్నారు. తొలి దశలో 9,123 పాఠశాలల్లో జూన్ కల్లా పనులను పూర్తి చేస్తామన్నారు. రెండు, మూడు విడతల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణం పై దృష్టి సారిస్తామని మంత్రి తెలిపారు.ఇదిలా ఉంటే టీచర్ల ట్రాన్స్‌ఫర్‌ల ద్వారా మారుమూల పాఠశాలలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందన్న వాదనపై సబితా ఇంద్రా రెడ్డి స్పందించారు. ఒక పాఠశాలలో పనిచేసే అందరు ఉపాధ్యాయులు బదిలీ అయ్యి.. కొత్త టీచర్లు రాని పరిస్థితి ఉంటే, బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయబోమని స్పష్టం చేశారు. కొత్త టీచర్లు వచ్చే వరకు వారు అక్కడే కొనసాగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ టీచర్ లేని పాఠశాల ఉండొద్దనేదే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి తెలిపారుస్కూల్స్ రీ ఓపెన్ నాటికే వాటిని విద్యార్థులకు అందించాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికే వస్త్ర సేకరణకు టెస్కోకు ఆర్డర్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

# హైకోర్టుకు సీబీఐ.... ఫైల్స్ ఇవ్వని సీఎస్

## ఎమ్మెల్యేల ఎర కేసులో అప్ డేట్

**హైదరాబాద్ :**

మొయినా బాద్ ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోళ్ళ కేసులో సీబీఐ ఏకంగా ఐదు సార్లు తెలంగాణ చీఫ్ సెక్రటరీకి లేఖ రాసింది. కోర్టు ఆదేశాల ప్రకారం తమకు ఆ కేసు ఫైల్స్ అను అప్పగించాలని విజ్ఞప్తి చేసింది. కానీ తెలంగాణ సీఎస్ మాత్రం స్పందించలేదు. మరో వైపు సుప్రీంకోర్టులో ఈ కేసు పదిహేడో తేదీన విచారణకు రానుంది. అప్పటి వరకూ సీబీఐ ఎదురు చూస్తుందా లేకపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలను చూసి రంగంలోకి దిగుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఫామ్ హౌస్ కేసులో కీలక పాత్ర పోషించిన ఆ నలుగురు ఎమ్మెల్యేలకు సంకటస్థితి ఏర్పడింది. అసలే ఎన్నికల ఏడాది? అందులో సీబీఐ విచారణ.. పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన బీఆర్ఎస్ నేతల్లో కనిపిస్తోంది. బహిరంగంగా చె?ప్పక పోయినా ఇటు నిందితులు, అటు పోలీసు ఉన్నతాధి కారుల బలవడం ఖాయమని రాజకీయ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. వాస్తవాలు ఎలావున్నా ఆ పరిణామాలు ఎన్నికలపై ఉంటాయన్న వాదన వినిపిస్తోంది. ఈ కేసులో బీజేపీ తో సంబంధాలున్న డీల్ వీరులు ముగ్గుర్ని తెరపైకి తెచ్చి విచారిస్తే, ఎవరెవరి పేర్లు బయటకు వస్తాయో నన్న ఆందోళన కనిపిస్తోంది. సీబీఐకి వివరాలు ఇవ్వకపోవడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. ఈ విషయంలో సీబీఐ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే కొత్త చీఫ్ సెక్రటరీ చాలా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అదే సమయంలో ఫామ్ హౌస్ కేసు సీబీఐ చేతికి వెళ్తే దరాబాద్, సైబరా బాద్ కమిష నర్లు కూడా ఇబ్బందులు న్యాయ పరమైన చిక్కుల్లో పడనున్నారు. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు-గా చేస్తూ రాజకీయ కుట్రలు చేస్తున్నారని స్టీఫెన్‌పై బీజేపీ నేతలు ఇప్పటికే తీవ్రమైన ఆరోపణలు చేశారు. సిట్‌కు నేతృ త్వం వహించిన సీవీ.ఆనంద్‌ను కూడా సీబీఐ ప్రశ్నించే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు. అందుకే ఇప్పుడు అందరూ ప్రభుత్వ పెద్దల వైపే చూస్తున్నారు. నిజానికి ఈ కేసు సీబీఐకి చాలా రోజుల క్రితమే వచ్చింది. వెంటనే విచారణ ప్రారంభించవచ్చు. తెలంగాణ సర్కార్ అప్పీల్ కు వెళ్లిందని సీబీఐ దూకుడుగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు. కనీసం కేసు కూడా నమోదు చేయలేదు. అదే సమయంలో తమకు కేసు వివరాలు, ఫైల్స్ ఇవ్వాలని పదే పదే చీఫ్ సెక్రటరీకి లేఖలు రాస్తోంది. తెలంగాణలో సీబీఐకి జనరల్ కన్సెంట్ రద్దు చేశారు. ఈ కారణంగా కోర్టు ఆదేశించినప్పటికీ తెలంగాణ ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అయితే ఇది లాంఛనమే. కోర్టు ను కాదనే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి లేదు. అయితే ఇది నేరుగా ప్రభుత్వానికి సంబంధించిన కేసు కావడంతో.. తాత్సారం చేస్తున్నారు. సీబీఐ చేతికి కేసు వెళ్తే సాక్ష్యాలు ధ్వంసమవుతాయని అంటున్నారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు చెబుతున్నారు. ఇప్పుడు సీబీఐ తెలంగాణతో సంబంధం లేకుండా.. ఢిల్లీలో కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు చేయడానికి అవకాశం ఉంది. కానీ ఈ దిశగా సీబీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. చేయాలనుకుంటే వెంటనే రంగంలోకి దిగుతుంది. సుప్రీంకోర్టులోనూ స్టే రాకపోతే.. ఆ తర్వాత సీబీఐ దూకుడు చూపించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎలా చూసినా ఈ కేసులో సీబీఐ ఒక్క సారి స్టెప్ ఇన్ అయిందంటే.. ఇక తర్వాత సంచలనాలు ఉంటాయన్న అభిప్రాయం మాత్రం ఎక్కువగా వినిపిస్తోంది.

# రాజకీయ నాయకుల నోట మావోయిస్టులపై సానుభూతి

**వరంగల్ :**

రాజకీయ పార్టీలు మావోయిస్టులను ఎందుకు ఎంచుకుంటున్నాయి. ప్రజల్లో సానుభూతి పెంచుకొని ఓట్ల రూపంలో అధికారంలోకి రావడానికా అంటే అవుననే సమాధానం వస్తుంది. ప్రజలను మెప్పించడానికి రాజకీయ నాయకుల నోట మావోయిస్టులపై సానుభూతి మాటలు వినిపిస్తున్నాయి. నాయకులకు ఈ మాటలు కొత్తేమికాదు. గతంలో, ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మావోలపై వ్యాఖ్యలు చేసి అధికారంలోకి వచ్చినవే. ఇప్పుడు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మావోలపై సానుభూతి మాటలు మాట్లాడారు. రాజకీయనాయకులకు మావోలపై సానుభూతి చూపెట్టనిదే అధికారంలోకి రామనే విషయం తెలిసిందా? అంటే అవుననే అంటున్నారు స్థానిక నేతలు. పార్టీలు అధికారానికి దూరమైన సందర్భాల్లో మావోలు గుర్తుకు వస్తారు. ఉత్తర తెలంగాణతో పాటు దక్షణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో మావోలపై సానుభూతి ఎక్కువగా ఉంటుంది. ప్రజల్లో ఉన్న సానుభూతిని మావోయిస్టుల కంటే రాజకీయ నాయకులే ఎక్కువగా వాడుకుంటారు. ప్రజల్లో మావోలపై ఉన్న సానుభూతి ఓట్ల రూపంలో రాబట్టుకోవడానికి నాయకులు అధికారం కోల్పోయిన ప్రతిసారి మావోలపై ప్రేమను చూపెడతారు. గతంలో అధికారంలో ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలు సైతం మావోయిస్టులను ఓట్ల కోసం వాడుకున్నవారే. తాజాగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ యాత్రలో ఉద్యమాల గడ్డ వరంగల్ లో మావోయిస్టులపై సానుభూతి మాటలు మాట్లాడి జనాలతో చప్పట్లు కొట్టించుకున్నారుఅయితే రాజకీయ నాయకులకు మావోయిస్టులపై ప్రేమ చూపెట్టడం కొత్తేమికాదు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్న టీడీపీని గద్దె దించడంకోసం వైఎస్ఆర్ అధికారంలోకి వస్తే మావోయిస్టులతో చర్చలు జరిపి వారి సూచన మేరకు పరిపాలనను కొనసాగిస్తామని చెప్పారు. దీంతో ప్రజల నుంచి ఓట్లు పడడానికి, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దోహదపడింది. అయితే మావోలతో జరిపిన చర్చలు సఫలం కాలేదు. కాంగ్రెస్ పార్టీ రెండు పర్యాయాలు అధికారంలో ఉంది. ఉద్యమ పార్టీగా కొనసాగిన ఇప్పటి బీఆర్ ఎస్ సైతం తెలంగాణ ఏర్పడిన తరువాత మావోయిస్టు పార్టీ అజెండానే టీఆర్ఎస్ అజెండా అని కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. రెండు పర్యాయాలుగా అధికారంలో కొనసాగుతున్న మావో అజెండాను కొనసాగించలేదు.కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై పది సంవత్సరాలు కావస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలు మొదలుపెట్టింది. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా వేదికగా హాత్ సే హాత్ జూడో యాత్రను చేపట్టాడు. అది కూడా గిరిజన పోరాట వీరవనితలు సమ్మక్క సారాలమ్మ కొలువైన మేడారం నుంచి యాత్ర మొదలుపెట్టారు. ములుగు కేంద్రంలో మావోయిస్టులకు సానుభూతిగా మాట్లాడారు రేవంత్. అయితే వైఎస్ఆర్, కేసీఆర్ స్టైల్లో కాకుండా ప్రజలు, మావోయిస్టులు తేల్చుకోవాలనే విధంగా మాట్లాడారు. రాష్ట్రంలో గడీల పాలన సాగుతుంది. గడీలను కూల్చిన చరిత్ర మావోలకు ఉంది. కేసీఆర్ గడీ అయిన ప్రగతి భవన్ ను మావోయిస్టులు బాంబులతో కూల్చాలని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గడీలు ప్రజలకు అవసరం లేదని మాట్లాడారు రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు మాటల దాడికి దిగడంతో పాటు చట్ట వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్ పై పోలీస్ లకు ఫిర్యాదు చేశారు. అయితే రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. మావోలతో చర్చలు జరుతామని వైయస్ఆర్, మావో అజెండాను అమలు చేస్తానన్న కేసీఆర్ మాటలకు ప్రజలు నమ్మిఓట్లు వేసారో తెలియదు కానీ. ఇద్దరు నేతలు రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చారు. మరి రేవంత్ రెడ్డి మావోల సానుభూతి మాటలతో ఓట్లు రాలుతాయో... అధికారంలోకి వస్తారో వేచిచూడాలి.

# యాత్రలో కనిపించని సీనియర్లు..!

**వరంగల్ :**

తెలంగాణ కాంగ్రెస్.... ఏదో ఒక ఇష్యూ కుదిపేస్తూనే ఉంటుంది. నేతల మధ్య డైలాగ్ లు పేలుతూనే ఉంటాయి. అంతలోనే కలుస్తారు.. మరోవైపు విమర్శలు గుప్పిస్తుంటారు..! ఏది చేసినా వారికే చెల్లుతుంది. ఏ నేత ఎటువైపు ఉంటారో కూడా కరెక్ట్ గా అంచనా వేయలేం...! ఎప్పుడు ఏం జరుగుతుందో కూడా చెప్పలేం..! అలా సాగే తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో... కొద్దిరోజులుగా పరిస్థితులు మారినట్లు కనిపిస్తున్నాయి. ఠాగూర్ ప్లేస్ లో ఇంఛార్జ్ గా ఠాక్రే రావటం... ఆయన నేతలతో భేటీ అవటం చకచక జరిగిపోయాయి. మరోవైపు ఎన్నికల ఏడాది కావటంతో.. యుద్ధానికి సిద్ధమయ్యే పనిలో పడింది. ఓవైపు అగ్రనేత రాహుల్ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తితో... రాష్ట్రంలోనే హాత్ సే హాత్ జోడో చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ములుగు నుంచి యాత్రను ప్రారంభించారు. సీన్ కట్ చేస్తే... మరోసారి సీనియర్ల తీరు చర్చనీయాంశంగా మారింది. యాత్ర ప్రారంభమే కాదు... ప్రగతి భవన్ పై రేవంత్ కామెంట్స్ వివాదంలోనూ సైలెన్స్ గా ఉండటం.... హాట్ టాపిక్ గా మారింది.మేడారం వేదికగా రేవంత్ రెడ్డి తన పాదయాత్రను ప్రారంభించారు. భారీ ఎత్తున కార్యకర్తలు, స్థానిక నేతలు తరలివచ్చినప్పటికీ... సీనియర్ నేతలు మాత్రం రాలేదు. ఒక్కరిద్దరూ కనిపించినప్పటికీ... మిగతా నేతలు రాకపోవటం చర్చనీయాంశంగా మారింది. కనీసం ప్రారంభం రోజైనా రాకపోవటం ఏంటన్న చర్చ మొదలైంది. నిజానికి పాదయాత్ర విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ విభిన్న వాదనలు వినిపించిన సంగతి తెలిసిందే. భద్రాచలం నుంచి ప్రారంభం కావాల్సిన యాత్ర... ములుగుకి షిఫ్ట్ అవటం వెనక కూడా పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. మొదట్నుంచి రేవంత్ పాదయాత్రకు సీనియర్ల మద్దతు ఉంటుందా..? లేదా..? అన్న చర్చ కూడా జరిగింది. అయితే ఠాక్రే నియామకం తర్వాత... సీన్ మారినట్లు కనిపించింది. కానీ అనూహ్యంగా పాదయాత్ర ప్రారంభ కార్యక్రమానికి సీనియర్లు రాకపోవటంతో... మరోసారి విబేధాల అంశంపై తెరపైకి వచ్చినట్లు అయింది.ఇదిలా ఉంటే పాదయాత్రలో భాగంగా... ప్రగతి భవన్ పై రేవంత్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రగతి భవన్ ను నక్సలైట్లు పేల్చేయాలంటూ మాట్లాడారు. అయితే దీనిపై బీఆర్ఎస్ పార్టీతో పాటు పలువురి నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అయితే ఏ ఒక్క కాంగ్రెస్ సీనియర్ నేత మాత్రం... రేవంత్ కు మద్దతుగా మాట్లాడలేదు. కనీసం ఈ అంశంపై స్పందించలేదు. మరోవైపు రేవంత్ అనుచరులు, మద్దతుదారులు మాత్రం... రేవంత్ కామెంట్స్ లో తప్పులేదని అంటున్నారు. స్వయంగా రేవంత్ రెడ్డి స్పందిస్తూ... నక్సలైట్లు అజెండానే తనది అన్న కేసీఆర్ ను ఎలా సమర్థించారని ప్రశ్నించారు. తనపై విమర్శలు చేసే వారు ఆలోచించుకోవాలంటూ హితవు పలికారు. ఇంత జరుగుతున్న సీనియర్ నేతలు... మౌనంగా ఉండటంపై అనేక అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలతో పాటు రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కారణంతో కూడా పలువురు నేతలు పాదయాత్రలో పాల్గొనకుండా పక్కకు జరుగుతున్నట్లు వార్తలు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ములుగులో పూర్తి కాగ... మహబూబాబాద్ నియోజకవర్గంలో జరుగుతోంది. అయితే రాబోయే రోజుల్లో ముఖ్య నేతల నియోజకవర్గాల్లో సాగే యాత్రకు వారి నుంచి ఎలాంటి సాకారం ఉంటుందనేది చూడాలి.

# కరోనా నుంచి మేల్కోని జీహెచ్ఎంసీ

**హైదరాబాద్ :**

కరోనాతో గడగడలాడిన ప్రపంచం మళ్లీ సాధారణ స్థితికి చేరినా, జీహెచ్ఎంసీకి మాత్రం ఇంకా కరోనా భయం పోలేదు. ఒకవైపు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన కనీసం జీతాలు, న్యూస్ పేపర్ల బిల్లులు చెల్లించలేని దీనస్థితి చేరుకున్న జీహెచ్ఎంసీ కరోనాకు మూసేసిన ఐదు పార్కుల క్యాంటీన్లతో కోట్లాది రూపాయల ఆదాయాన్ని కొల్పోయింది. ఆర్థిక వనరుల కోసం అన్వేషిస్తున్నామని, బల్దియాను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పకునే జీహెచ్ఎంసీ అధికారుల చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. జీహెచ్ఎంసీ నగరంలో క్యాంటీన్‌లున్న దాదాపు ఏడు భారీ తరహా పార్కులను అభివృద్ధి చేసి నిర్వాహణ చేపట్టింది.వీటిలో ఇమ్లిబన్ పార్క్ క్యాంటీన్‌ను ఏటా రూ.1.5లక్షలకు, కృష్ణకాంత్ పార్క్ క్యాంటీన్‌ను రూ.10 లక్షలకు, ఇందిరాపార్కు క్యాంటీన్‌ను ఏటా రూ.16లక్షలకు జలగం వెంగళరావు పార్క్, ఏఎస్ రావునగర్ పార్క్, ఈఎస్ఐ ఆస్పత్రి వెనకానున్న కేఎల్ఆర్ యాదవ్ పార్క్‌లను క్యాంటీన్లతో సహా మెయింటేన్ పాతబస్తీలోని మీరాలం చెరువుకు సమీపంలో ఏర్పాటు చేసిన పార్క్ క్యాంటీన్, కిషన్ బాగ్ పార్క్ క్యాంటీన్‌లను లక్షలాది రూపాయల వార్షిక ఫీజులకు లీజుకిచ్చారు. కరోనా మహమ్మారి ప్రబలిన 2020 మార్చిలో మూతపడ్డ ఈ క్యాంటీన్లను నేటికీ తెరవలేదు. మరో వైపు ప్రపంచం మొత్తం కూడా కరోనా, ఆ తర్వాత వచ్చిన వేరియంట్లను ఏమాత్రం పట్టించుకకోకుండా పూర్వస్థితికి చేరుకోగా, కరోనా భయం నుంచి బల్దియా అధికారులు ఇంకా బయటకు రాలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సిటీలోని మాసాబ్ ట్యాంక్ చాచానెహ్రూ పార్క్ క్యాంటీన్ ఇమ్లిబన్ పార్క్ క్యాంటీన్, కిషన్‌బాగ్ పార్కు క్యాంటీన్లను లీజుకు తీసుకున్న నిర్వాహకులు తాము ఆశించిన స్థాయిలో గిరాకీ రాకపోవటంతో కాంట్రాక్టుకు ఒప్పుకున్న డబ్బు చెల్లించటం కూడా గగనంగా మారిందని వాపోతున్నారు. పదేళ్ల నుంచి జలగం వెంగళరావు పార్క్ క్యాంటీన్, 2020 మార్చి నుంచి ఇందిరాపార్క్ క్యాంటీన్‌లు కూడా మూతపడగా, చాచానెహ్రూ పార్క్ ఇమ్లిబన్ పార్క్‌ల్లోని క్యాంటీన్ ఈ క్రమంలో ఇటీవలే బల్దియా అధికారులు కృష్ణకాంత్ పార్క్ క్యాంటీన్ లీజు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. సంవత్సరానికి రూ.9.11 లక్షలకు కేటాయించనున్నట్లు తెలుపుతూ 2020 చివర్లో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినా, అధికారులు సూచించిన రేటుకు నిర్వాహకులు ముందుకు రాలేదు. అప్పటికీ కరోనాలో కొత్త వేరియంట్లు వస్తుండటంతో జనాల్లో కొంత భయముండేది.జీహెచ్ఎంసీకి చెందిన పలు పార్కుల్లోని క్యాంటీన్లు లీజుకిస్తున్నారన్న విషయం తెలిసీ వచ్చిన నిరుద్యోగ యువత ముందుకొచ్చినా అధికారులు కేటాయించటం లేదని తెలిసింది. ఎలాగో అలాగా తాము వీటిని నడిపించుకుంటామని, కాంట్రాక్టు విలువ తగ్గించి తమకివ్వాలని కోరినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని పలువురు వాపోయారు. వీటిని వృథాగా వదిలేశారే తప్పా, అడిగిన వారికి కేటాయిస్తే కనీసం పార్కు మెయింటెనెన్స్ ఖర్చులో కొంత వరకైనా ఆదాయం సమకూరుతుందన్న దిశగా ఆలోచించకపోవటం వారి పనితీరుకు నిదర్శనం.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లను సమాయత్తం చేయండి

**ఓటర్లలో చైతన్యం తీసుకురండి**

**తెలుగుదేశం అభ్యర్థుల విజయమే లక్ష్యంగా**

**పెట్టుకొని పనిచేయండి**

**నాయకులకు కార్యకర్తలకు బద్వేలు తెలుగుదేశం**

**నాయకుల పిలుపు**

**బద్వేలు**

వచ్చే మార్చి 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటినుంచి ఓటర్లను సమాయత్తం చేసి వారిని చైతన్య వంతులను చేయాలని బద్వేలు తెలుగుదేశం నాయకులు పిలుపునిచ్చారు ఈ మేరకు శుక్రవారం బద్వేల్ మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి గ్రామీణ అధ్యక్షుడు రవి కుమార్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు వడ్లపూడి నాగభూషణం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సమ్మెట అబ్రహం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు గత నాలుగు సంవత్సరాల వైకాపా పాలనలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడింది ఓటర్లకు తెలియ చెప్పవలసిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి ఓటర్లు గుణపాఠం చెప్పాలని వారు పిలుపునిచ్చారు వైకాపా పై ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించి పాలనప్పగిస్తే గత నాలుగు సంవత్సరాలలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చుక్కలు చూపించారని వారు ఆరోపించారు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని వారు తెలిపారు జగన్మోహన్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత రాజధాని అమరావతి నీ అన్ని విధాలుగా భ్రష్టు పట్టించారని ఆరోపించారు దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా మన రాష్ట్రానికి మూడు రాజధానులు అంటూ ప్రజలను అయోమయంలోకి నెట్టి వేశారని వారు పేర్కొన్నారు ఒక సైకో ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుందో జగన్మోహన్ రెడ్డి నీ చూసి నేర్చుకోవాలని వారన్నారు రెండు రోజుల క్రితమే కేంద్రం అమరావతి మాత్రమే రాజధాని అని స్పష్టంగా చెప్పిందని ఇది ముఖ్యమంత్రికి చెంపపెట్టు అని వారన్నారు ఈనెల 23వ తేదీ సుప్రీంకోర్టులో జరిగేది కూడా ఇదేనని వారి పేర్కొన్నారు సుప్రీంకోర్టులో రాజధాని వ్యవహారం ఉన్నందున ఎక్కువగా మాట్లాడకూడదని వారు పేర్కొన్నారు జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పనులతో ప్రజలకు పిచ్చి పట్టిస్తున్నారని పరారోపించారు జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షగా నేతగా ఉన్నప్పుడు జరిపిన పాదయాత్రలో ఎక్కడలేని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదని వారు ఆరోపించారు ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం ఒకటో తేదీ వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు ప్రభుత్వ ఖజానా ఎప్పుడో ఖాళీ అయిందని అప్పులు కూడా పుట్టే పరిస్థితులు లేవన్నారు వైకాపా ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు అన్ని కులాల వారు మతాలవారు తీవ్రమైన కోపంతో ఉన్నారని వారు పేర్కొన్నారు రాష్ట్రం అధోగతి పాలు కావడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతకాని తనమే కారణమని ఆరోపించారు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు జగన్ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు

# దేశచరిత్రలో మహనీయులంతా బహుజనులే

**మంథని**



దేశ చరిత్రలో మహనీయులంతా బహుజన వర్గాలకు చెందిన వారేనని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జ్జి,పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో మహనీయుడు సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా రవిదాస్ చిత్రపటానికి పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ , గ్రంధాలయ ఛైర్మన్ రఘువీర్ సింగ్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు చెందిన వారే మన కోసం ఆనాటి నుంచే పోరాటం చేశారని, 400 ఏండ్ల క్రితం సర్థార్ సర్వాయి పాపన్న, వంద ఏండ్ల క్రితం మహాత్మపూలేలాంటి ఎంతో మంది మహనీయులు గొప్పగా ఆలోచన చేసి అందరూ కలిసి ఉండాలని, అందరూ గౌరవించబడాలని ఆరాటంతో పోరాటం చేసినట్లు చెప్పారు. ఇందులో సంత్ రవిదాస్ ఆరువందల ఏండ్ల క్రితమే బహుజన బిడ్డగా మన వర్గాలు ఐక్యతతో కులాలకు అతీతంగా జీవించాలని సందేశం ఇచ్చారని చరిత్ర చెబుతోందన్నారు. ఆనాడు రవిదాస్ నుంచే సమానత్వం మొదలైందని అప్పటి నుంచి ఎంతో మంది మహనీయులు తమ జీవితాలు, ప్రాణాలు త్యాగం చేశారని గుర్తుచేశారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రచించిన రాజ్యాంగంలో పొందుపర్చిన విషయాలను తెలియకుండా ఆనాటి పాలకులు చేశారని, మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఒక్క కులానికే పరిమితం చేసి చరిత్రను వక్రీకరించారన్నారు. ఎంతో మంది విజ్ఞానవంతులు ఉన్న సమాజంలో చరిత్రను, రాజ్యాంగాన్నిమనకు తెలియకుండా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరంప్రతి ఒక్కరిపై ఉందని, చరిత్రను తెలుసుకుని తిరగరాయల్సి అవసరం నేటి తరంపై ఉందని, లేకపోతే మనల్ని కాపాడేవారు ఉండరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నరు. ఈనాడు తామకంటే గొప్పవాళ్లు ఎవరూ లేరంటూ సోషల్‌మీడియాలో చెప్పుకుంటున్న తరుణంలో ఇంకా అవమానాలకు గురవుతున్న సమాజాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఎంతో మంది మహనీయుల పుణ్యస్థలాలు, జన్మస్థలాలు సందర్శించిన తాను కాశీలోని రవిదాస్ ఆలయాన్ని సందర్శిస్తానని, ఈ ప్రాంతంలోని బహుజనులకు ఆయన గొప్పతానాన్ని తెలియజేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## మంత్రి రోజా చెప్పులు మోసిన ఉద్యోగి

**బాపట్ల :**



పర్యాటకశాఖ మంత్రి రోజా బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరాన్ని సందర్శించారు. సరదాగా సముద్ర జలాల్లోకి దిగారు. అయితే ఆ సమయంలో తన చెప్పుల్ని బయట విడిచిపెట్టారు. పర్యాటక శాఖ హౌస్ కీపింగ్ ఉద్యోగి ఒకరు ఆ చెప్పులు తడిసిపోకుండా వాటిని చేతితో పట్టుకుని తిరిగారు. మంత్రి ఒడ్డుకు వచ్చిన తర్వాత వాటిని ఆమె కాళ్ల దగ్గర పెట్టారు. అయితే ఉద్యోగి ఇలా చెప్పులు మోయడం, మంత్రి వారించకపోవడం విమర్శలకు దారితీసింది.

# ఎస్సీ కళాశాల వసతి గృహ అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు

**జగిత్యాల :**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని గంజ్ రోడ్డులో గల ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహం - అధికారులపై స హా రక్షణ వేదిక జగిత్యాల జిల్లా శాఖ తరపున జిల్లా కలెక్టర్ కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు స హా రక్షణ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో గత సంవత్సరం అక్టోబర్ లో దసరా సెలవుల్లో డే అండ్ నైట్ వాచ్ మెన్ లు లేకున్నా వారు విధుల్లో ఉన్నట్టు ధృవ పత్రాలు జారీ చేసి వారికి పూర్తి జీతాలు చెల్లించారని తెలిపారు. ఈ విషయం ఆర్టీఐ ద్వారా అధికారులు స్వయంగా వెల్లడించారని, కావున కాంట్రాక్టర్లతో కుమ్ముక్కవడమే కాకుండా ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసిన వారిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కలెక్టర్ ను కోరినట్టు వివరించారు.

# ఆపరేషన్ స్వేచ్ఛ"వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం పోస్టర్

## ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

**నంద్యాల :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 9 ని వెట్టి చాకిరి నిర్మూలన దినోత్సవం గా ప్రకటించింది దీనిని పురస్కరించుకొని, 'ఆపరేషన్ స్వేచ్ఛ" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ఫిబ్రవరి 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు వెట్టి చాకిరి నిర్మూలన వారోత్సవాలుగా నిర్వహించడం జరుగుతుంది. కావున ఎక్కడైనా ఎవరితోనైనా వెట్టి చాకిరి చేయించుకున్నట్లయితే వారు చట్టపరంగా శిక్షార్హులు అందుకు సంబంధించిన పోస్టర్లు "నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్"ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ, సహాయ కార్మిక కమిషనర్ నంద్యాల బషీరున్నీసా బేగం, సహాయ కార్మిక అధికారులు ఏ. ఎం.డి సమీర్, బి మురళీకృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం తుమ్మలూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది ఒక డిసిఎం వాహనం కారు ను ఢీ కొట్టింది. దాంతో కారు లో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్య లో అతను కూడా మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంటకు ప్రమాదం జరిగింది. మహేశ్వరం పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం పోలీసులు అంటున్నారు. మృతులు నాగర్కర్నూల్ జిల్లా వెల్దండ కు చెందిన కేశవులు, శ్రీనివాసులు, యాదయ్య, రామస్వామి గా గుర్తించారు. విషాదం లో మునిగిపోయిన కుటుంబ సభ్యులు. నాగర్ కర్నూల్ నుండి హైదరాబాద్ కు వస్తుండగా ప్రమాదం జరిగింది..

## బాధిత కుటుంబాలకు అండగా వుంటాం

**కాకినాడ**

పెద్దాపురం మండలం జి రాగంపేట ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం జీజీహెచ్ లో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని వెల్లడించారు. సమగ్ర విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. రూ.50 లక్షల పరిహారంతో పాటు ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని వెల్లడించారు. వ్యక్తిగతంగా ఒక్కొక్క కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భవిష్యత్ లోనూ బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు

## ఫిబ్రవరి 14 న జవాన్ ల దినోత్సవం

**రంగారెడ్డి**

పుల్వామా దాడిలో అమరులైన జవానుల త్యాగాలను స్మరించుకుంటూ ఫిబ్రవరి 14వ తేదీన జవాన్ ల దినోత్సవం గా నిర్వహించుకోవాలని బజరంగ్దళ్ నేతలు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద మైలర్ దేవ్ పల్లి బజరంగ దళ్ నేతలు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బజరంగ్దళ్ నేతలు మాట్లాడుతూ విదేశీ సంస్కృతి అయిన ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే ని యువత ఎవరు నిర్వహించుకోవద్దని కోరారు. ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామా దాడిలో అమరులైన జవాన్లను స్మరించుకుంటూ వీర జవాన్ల దినోత్సవంగా ఫిబ్రవరి 14న నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే రోజున ఎవరైనా ప్రేమికులు కనబడితే వారిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తామని తెలిపారు. భారతదేశ సంస్కృతిని వాలెంటైన్స్ డే పేరుతో చెడగొట్టకూడదని పిలుపునిచ్చారు.

## గంజాయి రవాణాపై ఉక్కుపాదం



**విశాఖపట్నం**

విశాఖపట్నం నగరంలో గంజాయి అక్రమ రవాణా పైన సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుసగా దాడులు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు బృందాలుగా ఏర్పడిన సెబ్ పోలీసులు వేపగుంట జంక్షన్ నుంచి హనుమంత వాక వరకు సినీ ఫక్కీ లో చేజింగ్ చేసి 150 కేజీ ల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నగరం లోకి భారీగా గంజాయి సరఫరా జరుగుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు సెబ్ అధికారులు వేపగుంట జంక్షన్ వద్ద రూట్ వాచ్ నిర్వహించారు. అధికారులను గమనించిన స్మగ్లర్లు కారును అడవివరం జంక్షన్ మీదుగా హనుమంతవాకకు మళ్ళించారు. మరో సెబ్ అధికారుల బృందం హనుమంతు వాక వద్ద కాపు కాయడంతో గంజాయితో సహా కారును వదిలేసి నిందితుడు పరారయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న విశాఖపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు కారును గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్టు చేయడంతో పాటు నగరంలో గంజాయి అక్రమ రవాణా పూర్తి స్థాయిలో అడ్డుకోవడంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని సెబ్ జాయింట్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు.

## లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలి

**మదనపల్లె**

ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా మదనపల్లే టుటౌన్ సిఐ మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. నేడు మదనపల్లె పట్టణంలోని అనిబెసెంట్ సర్కిల్ నుంచి న్యాయ శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఈ ర్యాలీని నిర్వహించారు.

# 160 వర్సెస్ 175

**గుంటూరు :**

ఇదేమిటీ..ఈ లెక్క అనుకుంటున్నారా... టీడీపీ లెక్కలో 160 సీట్లు... వైసీపీలో వై నాట్ 175 అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.. ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు ఎన్నికల గోల ఎక్కువైన విషయం తెలిసిందే. అటు తెలంగాణలో అధికారంలో ఉన్న కేసిఆర్..ఇటు ఏపీలో అధికారంలో ఉన్న జగన్..గడువు కంటే ముందు గానే ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. తెలంగాణలో ఎలాగో గతంలో కేసిఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్ళి సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో మరోసారి కేసిఆర్ ముందస్తుకు ప్లాన్ చేస్తున్నారని ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బిజేపిలు..ఖచ్చితంగా కేసిఆర్ ముందస్తుకు వెళ్తారని అంటున్నాయి. కానీ బిఆర్ఎస్ నేతలు మాత్రం ముందస్తుకు వెళ్ళే ఆలోచన లేదని, ఈ సారి షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని అంటున్నారు.అయితే తెలంగాణలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. అందుకే తెలంగాణ విషయం పక్కన పెడితే..ఏపీలో కూడా ముందస్తు ఎన్నికలపై చర్చ నడుస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ అధికారంలో జగన్ సైతం ప్రభుత్వాన్ని ముందుగానే రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని ఇక్కడ ప్రతిపక్ష టిడిపి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది.ఇప్పటికే జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ఇంకా పూర్తిగా వ్యతిరేకత పెరగక ముందే జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్తారని అంటున్నారు. టిడిపి అధినేత చంద్రబాబు పదే పదే ముందస్తుపై కామెంట్ చేస్తూనే ఉన్నారు.కానీ అధికార వైసీపీ నేతలు మాత్రం ముందస్తుకు వెళ్ళే ఛాన్స్ లేదని, షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్తామని అంటున్నారు.అయితే ఎవరి వ్యూహం ఎలా ఉందో ఎవరికి క్లారిటీ లేదు. ముందస్తుపై నిర్ణయం మాత్రం జగన్‌దే..ఆయన వ్యూహం ఎలా ఉందనేది తెలియదు. కానీ టిడిపి మాత్రం ఓ అంచనా వేస్తుంది. ముందస్తు జరుగుతుందని భావిస్తున్నారు. తాజాగా ఏపీ టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ముందస్తుపై కామెంట్ చేశారు. రాష్ట్రంలో ఖాయంగా ముందస్తు ఎన్నికలు రాబోతున్నాయని, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కేసుల నుంచి కాసుల దాకా అనేక సమస్యల్లో కూరుకుపోయి ఉన్నారని, అవి తనను ముంచేయక ముందే ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారని చెప్పుకొచ్చారు .ముందస్తుకు తాము రెడీగా ఉన్నామని, రేపు ఎన్నికలు జరిగినా టీడీపీకి 160 సీట్లు ఖాయమని, జగన్ రెడ్డి మాదిరిగా 175 సీట్లు వస్తాయని అతిశయోక్తులు చెప్పుకోవడం తమకు అలవాటు లేదని అన్నారు. అయితే ఇలా ముందస్తుపై టిడిపి ధీమాగా ఉంది. కానీ వైసీపీ నుంచి ముందస్తుపై క్లారిటీ లేదు. చూడాలి మరి ఏపీలో ముందస్తు ఎన్నికలు జరుగుతాయో లేదో.

# బీఆర్ఎస్, ఎంఐఎం చర్చలు

**హైదరాబాద్ :**

తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ రిలీజ్ చేసింది. దీంతో తెలంగాణలో ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది. తెలంగాణలో ఒక టీచర్, ఒక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కాబోతున్నాయి. ముఖ్యం హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంపై మజ్లిస్ పార్టీ నజర్ పెట్టింది. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తిగా మారబోతున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఎంఐఎం పార్టీకి చెందిన సయ్యద్ అమినుల్ హసన్ జాఫ్రీ ఉన్నారు. మే 1తో గడువు ముగుస్తోంది. అయితే మరోసారి ఈ స్థానంలో ఎంఐఎం పాగా వేయాలని అనుకుంటోంది. దీని కోసం బీఆర్ఎస్ పార్టీ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తోంది.ఇప్పటికే ఎంఐఎం పార్టీ ముఖ్యనేతలు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ బీఆర్ఎస్ నేతలతో వరసగా భేటీ అవుతున్నారు. ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదల కావడంతో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఇటీవల పాతబస్తీ పర్యటన సమయంలో అక్బరుద్దీన్ ఓవైసీ, మంత్రి కేటీఆర్ తో భేటీ అయ్యారు. తాజాగా అసద్ ఈ రోజు కేటీఆర్ తో సమావేశం అయ్యారు. అయితే ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మద్దుతు ఇస్తుందా..? లేదా..? అనేది ఉత్కంఠగా మారింది. గ్రేటర్ హైదరాబాద్ లో బీజేపీకి కూడా కార్పొరేటర్లు ఉండటంతో ఆ పార్టీ కూడా అభ్యర్థిని పెట్టే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతానికి బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ మద్దతు పీఆర్టీయూ కా..? కమ్యూనిస్ట్ పార్టీకా..? అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల అయింది. ఏపీలో 13, తెలంగాణలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీని కోసం ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 16 నుంచి 23 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 24న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు ఫిబ్రవరి 27. మార్చి 13న పోలింగ్, మార్చి 16న కౌంటింగ్ ఉండనుంది

# కొత్త సచివాయం గుమ్మాటలను కూల్చివేస్తాం

### బండి సంజయ్

**కూకట్ పల్లి**

జనం గోస ? బీజేపీ భరోసాలో భాగంగా కూకుట్ పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయినపల్లి లో 77, 78,79 వార్డుల పరిధతిలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు.

బీజేపీ అధికారంలోకి వస్తే.... నూతన సచివాలయ టూంబ్స్ (గుమ్మటాలు)ను కూల్చేస్తాం. తెలంగాణలో నిజాం వారసత్వ సంస్కృతిని ధ్వంసం చేస్తాం... నిజాం వారసత్వ బానిస మరకలను సమూలంగా తుడిచివేస్తాం. భారతీయ, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సచివాలయంలో మార్పులు చేస్తాం. ప్రగతి భవన్ ను ప్రజా దర్బార్ లా మారుస్తాం. తెలంగాణలో నిజాం వారసత్వ మరకలను సమూలంగా తూడిచివేస్తామని హెచ్చరించారు.

ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే సచివాలయాన్ని తాజ్ మహల్ లాంటి సమాధిలా మార్చారు. రోడ్డు కు అడ్డం ఉంటే మసీదులు, మందిరాలు కులుస్తామన్న కేసీఆర్ దమ్ముంటే, పాతబస్తీలోని రోడ్లకు అడ్డంగా ఉన్న మసీదులను కూల్చండని అన్నారు. అసెంబ్లీ లో బీఆర్ఎస్, ఎంఐం కలిసి నాటకం ఆడుతున్నాయి. కూకట్ పల్లి లో పేదల భూములను కబ్జా చేశారు... వారి పైన కేసు లు పెడుతున్నారు. రాష్ట్రంలో 11 వేల స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లు పెడతామని వెల్లడించారు.

ఎక్కడ ఎన్నికలు జరిగిన బీజేపీ కి పట్టం కడుతున్నారు ప్రజలు. బీఆర్ఎస్ మూర్ఖత్వ పాలనను ప్రజలకు వివరించేందుకు ఈ మీటింగ్ లు. మోదీ పాలనా విజయాలను వివరిస్తాం. సీఎం కేసీఆర్ ఫార్మ్ హౌస్, ప్రగతి భవన్ కు పరిమితం అయ్యారు. ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేదు . ఈ రోజుకి ఇంకా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు రాలేదు. రాష్ట్ర ఆదాయంలో60 శాతం హైదరాబాద్ నుండే వస్తోంది. హైదరాబాద్ ను ఏ మేరకు అభివృద్ధి చేశారో స్పష్టం చేయాలి. దుర్మార్గులు, దుష్టులు ఇద్దరు ఏకమై బీజేపీ కి మేయర్ పదవి రాకుండా చేశారు. మూతపడ్డ ఫైనాన్స్ దుకాణానికి కొత్త పేరు పెట్టి తెరిచినట్లుగాట బీఆర్ఎస్ వ్యవహారమని విమర్శంచారు.

కెసిఆర్ ఎక్కడి కి వెళ్ళినా అబద్ధాలు చెబుతున్నారు. మోదీ ప్రభుత్వం 3 కోట్ల ఇండ్లు ఇచ్చింది.... కేసీఆర్ ఎంత మందికి డబల్ బెడ్రూం లు ఇచ్చారో చెప్పాలి. అన్ని ఛార్జ్ లను పెంచిన కేసీఆర్ భూములు కబ్జాతో వేల కోట్లు సంపాదిస్తున్నారు. వేల కోట్ల అక్రమాస్తులు కూడబెట్టి విదేశాల్లో పెట్టుబడులు పెడుతున్నారని ఆరోపించారు.

# ప్రజలకు దారి లేకుండా చేయడం అన్యాయం

**సంబేపల్లె :**

దళితులకు దారిలేకుంఢా చేసిన కబ్జా దారుల పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ అన్నారు శుక్రవారం సంబేపల్లి మండల పరిధిలోని రౌతు కుంట గ్రామం గట్టు హరిజనవాడ లో సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కబ్జా కు గురైనా దారిని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఉన్న మినహాయింపు దారిని కొంత మంది ఆక్రమించు కోని దళితులు సొంత పొలాల వద్దకు దళితులను పోనీయకుండా ఇబ్బందులు కు గురిచేయడం దారుణమన్నారు అక్రమాలకు పాల్పడుతూ దారిలేకుండా చేసిన కబ్జా దారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు జె సి బీ. యంత్రాలతో దారిని చదును చేయడం దుర్మార్గమన్నారు స్థానిక దళితవాడ ప్రజలు అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకొని పోయినా రెవిన్యూ అధికారులు పట్టించు కున్న పాపాన పోలేదని బాదితులు వాపోయారని అన్నారు ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి భూ కబ్జా దారుల పై చర్యలు తీసుకొని గట్టు హరిజనవాడ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన కోరారు లేని పక్షంలో సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు

## ఇంతీయాజ్ కు సన్మానం

**మదనపల్లె**

కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి యూత్ కాంగ్రెస్ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు ఇంతీయాజ్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎపిసిసి ఓబిసి జాయింట్ కో ఆర్డినేటర్ నాగూర్ వల్లి, కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గిరీష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డి సాహెబ్ ఆకాంక్షించారు. నేడు రాజంపేట పార్లమెంటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన ఇంతీయాజ్, మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షులు గుల్షన్ లను మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎపిసిసి ఓబిసి జాయింట్ కో ఆర్డినేటర్ వేమయ్య యాదవ్, నజీర్, జబివుల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంతియాజ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ద్వారానే కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సాధ్యమని పేర్కొన్నారు.

## అర్హులకు పేదలకు సంక్షేమ ఫలాలు అందాలి

**కాకినాడ**

సి.ఎం. వై.యస్. జగన్మోహన రెడ్డి నవరత్న పథకాల ద్వారా అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు అందే విదంగా వాలంటీర్లు కృషి చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. కాకినాడ విద్యుత్ నగర్ లోగల ఎ -కన్వెన్షన్ హాల్లో వాలంటీర్ల సమావేశం జరిగింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వాలంటీర్లను ఉద్దేశ్యించి ప్రసంగిం చారు. ఈకార్యక్రమంలో కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పసుపులేటి వెంకటలక్ష్మీ, నల్లబిల్లి సుజాతసాయిబాబు, రావూరి వెంకటేశ్వరరావు, కృష్ణప్రియ, ఎన్.ఎస్. రాజు, సిగల మధు, పసుపులేటి చంద్రశేఖర్, వెంకటరమణ, పెద్ద సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వాహనదారుడు మృతి




**హైదరాబాద్**

సరూర్ నగర్ పోలీస్ పరిధి లోని మందమల్లమ్మ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. శివాజీ నగర్,ఉప్పుగూడ కు చెందిన కాశింగారి సంతోష్ (42) , చంపాపేట్ నుండి ఎల్బీ నగర్ వైపు తన హోండా షైన్ బైక్ పై వెళుతున్నాడు. ఆదే సమయంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక వైపు నుండి వచ్చి బైక్ను ఢీకొట్టింది. దాంతో సంతోష్ అక్కడికక్కడే మరణించాడు. కేసు నమోదు చేసుకున్న సరూర్ నగర్ పోలీసులు , పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రి కి తరలించారు.

## వాహన దారులకు తప్పిన పెను ముప్పు

**హైదరాబాద్**

శుక్రవారం మద్యాహ్నం ఒక్కసారిగా చాదర్ ఘట్ ప్రధాన రహదారి గొయ్యి ఏర్పడింది. రోడ్డు కింద 20 ఫీట్ల లోతు వరకు డ్రైనేజీ నిర్మాణం ఉన్నట్టు సమాచారం. అప్రమత్తమై స్పందించిన పోలీసు అధికారులు, వెంటనే జిహెచ్ఎంసి అధికారులకు సమాచారం ఇచ్చారు. గొయ్యి చుట్టూ రక్షణ కవచనం ఏర్పాటు చేసి ట్రాఫిక్ ను మళ్లించారు.

## సినీ ఫక్కిలో పాత నేరస్థుడి ఆరెస్టు

**మేడ్చల్**

మేడ్చల్ జిల్లాలో ఓ పాత నేరస్తుడి అరెస్ట్ సినీఫక్కి లో జరిగింది. కుతాడి శ్రీనివాస్ అలియాస్ ఎరుకల శ్రీను పై మేడ్చల్ పోలీస్టేషన్ లో 7 కేసులు నమోదై ఉండగా అల్వాల్ లో 7 కేసులు, జవహర్ నగర్ లో ఓ కేసు నమోదై ఉన్నట్లు మేడ్చల్ సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. పెండింగ్ కేసుల విషయంలో పోలీసులకు సహకరించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. నగర శివారు నాగోల్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో శ్రీనివాస్ కుమారుడి పెళ్లి జరుగుతున్న సమాచారంతో అక్కడికి చేసుకున్న పోలీసులు అదను చూసి అర్ధరాత్రి సమయంలో హుటాహుటిన కుతాడి శ్రీనివాస్ ను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు సిఐ తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కుతాడి శ్రీనివాస్ గతంలో అనేక చోట్ల భూ దందాలు చేసి కొనుగోలుదారులను మోసం చేయడం, ఎదురు తిరిగితే బెదిరింపులకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. పోలీసులకు దొరకకుండా ఢిల్లీ, దుబాయ్ లలో తలదాచుకున్న శ్రీనివాస్, కొడుకు పెండ్లికొసం నగరానికి వచ్చినట్లు తెలిసి మాటువేసి అరెస్టు చేశామన్నారు.

# అప్పుల్లో మునిగిన ట్రాన్స్ కో, జెన్ కో లు

## టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

**మహబూబాబాద్**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ నేత భట్టి యాత్రలో పాల్గొనలేక పోతున్నారని టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం అయన లచ్చతండా లో మీడియాతో మాట్లాడారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఆయన సోదరుడు ఇల్లందులో కాంగ్రెస్ ను గెలిపించారు. ప్రజలు కేసీఆర్ కు ఇచ్చిన అవకాశం ముగిసింది. పది బడ్జెట్ లలో 23 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఒక్కో నియోజకవర్గానికి 20వేల కోట్లు ఖర్చు చేయాలి. మరి ఇల్లందు నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేకపోయారు. రూ.5వేల కోట్లు ఫీజు రీయబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ లో 800 కోట్ల బకాయిలు ఉన్నాయని అన్నారు.

2003 కు ముందు విద్యుత్ కోతలు ఉన్నట్లే.. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయి. ఆనాడు ఎదుర్కున్నట్లుగానే ఈనాడు రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఎదుర్కొంటున్నాం. ఆనాడు బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంతో ప్రభుత్వం కుప్పకూలింది. సాధ్యం కాదన్న ఉచిత విద్యుత్ ను కాంగ్రెస్ అమలు చేసి చూపిందని అన్నారు. రైతులకు అనుకూలమైన విధానాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చింది. రైతులకు 24 గంటల విద్యుత్ పై కేసీఆర్ ఆడంబరపు ప్రకటనలు ఇచ్చారు. ప్రయివేటు విద్యుత్ సంస్థల్లో 50శాతం కమిషన్లు దండుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు 20వేల కోట్ల బకాయి పడింది. ట్రాన్స్ కో, జెన్ కో కలిపి 60వేల కోట్ల అప్పుల్లో మునిగిపోయాయి. కేసీఆర్ ధన దాహంతోనే ఈ పరిస్థితి. విద్యుత్ కొనుగోళ్ళల్లో వేల కోట్ల కుంభకోణం జరిగింది. ఏపీలో మిగులు విద్యుత్ తక్కువ ధరకే సరఫరా చేస్తామన్నా కేసీఆర్ సుముఖత చూపలేదు. కమిషన్లు, కాసుల కక్కుర్తి కోసమే తన నమ్మిన బంట్ల వద్ద కొనుగోలు చేశారని అన్నారు.

ఛత్తీస్ ఘడ్ విద్యుత్ ఒప్పందంలో లోపభూయిష్టం ఉందని గతంలో ఉద్యోగి రఘు ఫిర్యాదు చేశారు. దీన్ని ఒప్పుకోని అధికారిని కేసీఆర్ బదిలీ చేశారు. గుజరాత్ కంపెనీతో వెయ్యి కోట్లు లంచం తీసుకుని కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టె క్నాలజీని కొన్నారు. దాదాపు 10వేల కోట్లు అప్పు భారం జెన్ కో, ట్రాన్స్ కో మీద పెట్టారు. యాదాద్రి పవర్ ప్లాంట్ టెండర్ లేకుండా బీహెచ్ఈఎల్ కు అప్పగించారు. సివిల్ వర్క్ ను సొంత కాంట్రాక్టర్లకు ఇప్పించి వేల కోట్లు దోచుకున్నారు. తొమ్మిదేళ్లయినా యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి చేయలేదని అన్నారు. 10వేల కోట్లు భద్రాద్రి కోసం..35వేల యాదాద్రి కోసం అప్పు తెచ్చారు. స్థాయి , అనుభవం లేని అధికారులకు బాధ్యతలు అప్పగించారు. చిన్న ఉద్యోగాలు చేసి, రిటైర్ అయిన ప్రభాకర్ రావును జెన్ కో కు సీ ఎండీగా నియమించారు. దోపిడీకి సహకరించిన ప్రభాకర్ రావుకు, రఘుమా రెడ్డికి ఉన్నతమైన బాధ్యతలు అప్పగించారుని అన్నారు. కేసీఆర్ దోపిడీ వల్లే విద్యుత్ సంస్థలు కుప్పకూలిపోయాయి. రైతులు తీవ్ర విద్యుత్ సంక్షోభం ఎదుర్కొంటున్నారు. 2014 నుంచి జరిగిన విద్యుత్ కొనుగొల్లపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. యాదాద్రి పవర్ ప్లాంట్ విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం 20వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి. ఎవరూ ఏసీడీ చార్జీలు కట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రభుత్వ వైఖరిపై నిరసనలు తెలపండి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏసీడీ చార్జీలు రద్దు చేస్తుంది. రైతు సంఘాలు, రైతులు అందరం రోడ్డెక్కుదామని పిలుపునిచ్చారు. బషీర్ బాగ్ ఉద్యమం లాంటి మరో ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉంది. మొదటి దశలో రోడ్డెక్కి నిరసన, ఆ తరువాత సబ్ స్టేషన్ల ముట్టడిస్తాం. ఈఆర్సీ సరైన నిర్ణయం తీసుకోకపోతే విద్యుత్ సౌధను ముట్టడిస్తాం. ఈ దోపిడీ లబ్ధిదారులు కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు. కమ్యూనిస్టులు దోపిడీదారుల పక్షాన ఉంటారో... ప్రజల పక్షాన కొట్లాడుతారో నిర్ణయించుకోవాలని అన్నారు.

# విద్యుత్ కోతలపై బీజేపీ అందోళన

**నిర్మల్**

వ్యవసాయ రంగానికి విద్యుత్తు కోతలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు హోరెత్తాయి. ఆ పార్టీ నేత రామారావు పటేల్ నేతృత్వంలో కమలనాథులు, రైతులు కదం తొక్కారు. నిర్మల్ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. ఇరువైపుల పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అక్కడి నుంచి ర్యాలీగా 132/11 కేవీ సబ్ స్టేషన్ కు వెళ్లి కార్యాలయాన్ని ముట్టడించారు. బీఆర్ఎస్ సర్కారుకు వ్యతిరేఖంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా రామారావు పటేల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కారు వ్యవసాయ రంగానికి 24గంటలు కరెంటు ఇస్తున్నామని గప్పలు చెప్పడమే కానీ కనీసం 5 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కరెంటును నమ్ముకొని రైతులు రబీలో పంటలు సాగు చేశారని, ఇప్పుడు కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంటలకు వేళ పాలలేని కరెంటు కోతలతో పంటలకు సరిగ్గా నీరు అందడం లేదన్నారు. దీంతో చేతికందే దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర కరెంటు సరఫరా చేయని యెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా నాందేడ్ సభలో కూడా సీఎం కేసీఆర్ కరెంటు 24గంటలు ఇస్తున్నామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి ఎక్కడ 24గంటలు ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్తు అధికారులకు వినతి పత్రం అందించారు.

ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, సీనియర్ నాయకుల రవి పాండే, గోపాల్ సర్డా, నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మండల పరిషత్ అధ్యక్షులు ఆప్కా గజ్జరం, వద్నం నగేష్, అంతగిరి రాజన్న, కళ్యాణి గజేందర్, జిల్లా కార్యదర్శి భూమేష్, మండల అధ్యక్షులు బిజెపి బైంసా మహగాం సర్పంచ్ బిజెపి నాయకులు రాకేష్బీజేపీ నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

## కోవిడ్ నిబంధనలను తప్పక పాటించాలి

## కలెక్టర్ వి.విజయ్ రామరాజు

**కడప**

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని బోర్డ్ రూమ్ నుండి కేంద్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై.. జేసీ సాయి కాంత్ వర్మ, , డిఆర్వో గంగాధర్ గౌడ్ ,జిల్లా అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు వీసీ ద్వారా ఆర్డీఓ, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో జిల్లాలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం జరిగే.. ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరూ తప్పకుండా శిక్షణకు హాజరుకావాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ సిబ్బందిని.. వారి సొంత మండలంలో కానీ, వారు విధులు నిర్వహించే మండలానికి కానీ.. ఎన్నికల విధులు కేటాయించకూడ దన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు.. భద్రతగా ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూము, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కౌంటర్లు, నార్మల్ సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు, తదితర ప్రాంతాలవద్ద నియమ నిబంధనల మేరకు బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సూచనల మేరకు.. కోవిడ్ -19 ప్రోటోకాల్ ను పాటించాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ నియమావళిని తూచా తప్పక అందరూ పాటించాలన్నారు ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించాలన్నారు. ర్యాండమైజేషన్. పద్ధతి ద్వారా.. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధులను కేటాయించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ.. గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జరగబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులందరికి కేటాయించిన విధులను తప్పక పాటించాల న్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి న ఓటర్ల జాబితాలో డూప్లికేషన్, అర్హత లేని వారుంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫోటోలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నేటి నుండి అమలులో ఉంటుందని ప్రభుత్వ అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డ్వామా పిడీ యదుభూషన్ రెడ్డి, డిఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్ , డిటిసి మీరా ప్రసాద్,డిఎంహెచ్ఓ డా.నాగరాజు,సిపిఓ వెంకటరావు, ఎన్ఐసి డిఐఓ విజయకుమార్, డిసిఓ సుభాషిణి, జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి,సర్వ శిక్ష అభియాన్ పిఓఎస్ ఎస్ ప్రభాకర్ రెడ్డి,మెప్మా పిడి రామ్మోహన్ రెడ్డి, నోడల్ అధికారులు, పోలీస్ అధికారులు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల సూపర్ ఇంటెండెంట్లు,డివిజన్ కేంద్రాల నుండి ఆర్డీవోలు, తహశీల్దార్లు తదితరులు హాజరయ్యారు

# ఉమ్మడి మెదక్ జిల్లాల్లో అవిశ్వాసాల జోరు

**మెదక్**



ఉమ్మడి మెదక్ జిల్లాలో అవిశ్వాసా జోరు కొనసాగుతోంది. ఇప్పటికే సంగారెడ్డి, సదాశివపేట, అందోల్-జోగిపేటల్లో మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాసం తీర్మానాలు పెట్టిన విషయం తెలిసిందే. తాజాగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళిపైనా అవిశ్వాసం ప్రారంభమయింది. సీఎం కేసీఆర్ గజ్వేల్ నుండి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ కు చెందిన 14 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ మేరకు గురువారం నాడు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కి అవిశ్వాస నోటీసులిచ్చారు. చైర్మన్ అవినీతికి పాల్పడుతున్నాడని, తమ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కౌన్సిలర్ల ఆరోపణ. గజ్వేల్ మున్సిపల్ లో మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. అందులో 14 మంది అవిశ్వాస తీర్మానం పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అవిశ్వాసం ఇచ్చిన వెంటనే క్యాంపునకు కౌన్సిలర్లు వెళ్లిపోయారు. అందరి ఫోన్లు స్విచ్ఛాఫ్ అయిపోయాయి. ఫారెస్టు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్రెడ్డే అసమ్మతి వర్గాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రతాప్ రెడ్డి ప్రస్తుతం గోవాలో ఉన్నట్లు సమాచారం.

# మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరం

## రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా

**రైల్వే కోడూరు**



మండలంలోని మాధవరంపోడు గ్రామం నందు క్షత్రియ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ముఖ్య అతిథులుగా పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా , ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడారు క్రీడలు శరీర ధారుఢ్యానికి మానసిక వికాసానికి దోహద పడతాయన్నారు పోటీల్లో రాణించి ఊరికి, తల్లి దండ్రులకు పేరు తేవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ సాయి కిషోర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేమన వర్మ,మండల కన్వీనర్ సుధాకర్ రాజు, వైస్ ఎంపీపీ గౌరీ, ఉప సర్పంచ్ తోట శివ సాయి,వేణు గోపాల్ రాజు, నాగేంద్ర రాజు, వెంకట రెడ్డి,సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ రామరాజు, వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# పోడు భూములకు త్వరలో పట్టాల పంపిణీ

## _ ముఖ్యమంత్రి కేసీఆర్..

**హైదరాబాద్ :**

తెలంగాణలో పోడు భూముల సమస్యపై ముఖ్యమంత్రి కేసీఆర్... అసెంబ్లీ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. పోడు భూముల సమస్య న్యాయమైన డిమాండ్ కాదని తేల్చేశారు. పోడు భమూలు కావాలంటే దురాక్రమణే అన్నారు. అటవీ బిడ్డలం తమకు అటవీ భూములు ఇవ్వాలంటే మొత్తం అడవులు నరికేస్తే పీడపోతుందన్నారు. ప్రతిసారీ దీనిపై రాజకీయం చేయడం అలవాటైపోయింది. అడవులన్నీ నరికేయడం కరెక్టేనా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాల వల్ల ఈ సమస్య నేటికీ వెంటాడుతోందన్నారు కేసీఆర్ ఇలా అడవిని కొట్టి అందరికీ పంచేద్దామా అని ప్రశ్నించారు కేసీఆర్. గతంలో ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల ఈ విషయం పెద్ద సమస్యగా మారిందన్న సీఎం... కొన్ని పార్టీలకు ఇదో ఆట వస్తువుగా మారిందని ఎద్దేవా చేశారు. కొందర్ని పోగేసి కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేయడం అలవాటుగా మారిందన్నారు. గిరిజనులను కాపాడటంలో ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వారి హక్కులకు ఎలాంటి భంగం కలిగించదన్నారు. రాష్ట్రంలో అటవీ సంపద ఉండాలా కనుమరుగు కావాలా... బ్రెజిల్, చైనా తర్వాత చాలా కష్టపడి తెలంగాణలో అటవీ విస్తీర్ణం పెంచామన్నారు కేసీఆర్. అధికారులను బెదిరిస్తే కానీ నేడు మొక్కలను సంరక్షించుకోలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్లో ఎలాంటి సినిమా షూటింగ్లు అయ్యేవో దాన్ని ఎలా నాశనం చేశారో అందరికీ తెలిసిందే అన్నారు. కనుమరుగైన అటవీ సంపదను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. ఇలా చేసిన కృషి ఫలితంగానే మంచి రిజల్ట్ కూడా వచ్చాయని... దానికి అనేక అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. అంతర్జాతీయంగా పేరు వచ్చిందన్నారు. 7.8 అటవీ విస్తీర్ణం పెరిగిందని అంతర్జాతీయ సంస్థలు కితాబు ఇచ్చాయని వెల్లడించారు. అయితే పోడు భూముల విషయంలో మాకు స్పష్టత ఉందన్నారు సీఎం కేసీఆర్. ఇప్పుడు ఎవరైతే సాగు చేసుకుంటున్నరో... వాళ్లకు పట్టాలు ఇవ్వడానికి అభ్యంతరం లేదన్నారు. అయితే పోడు సమస్య ఇంకా ఇదేవిధంగా కొనసాగాలా.. దీనికి ముగింపు కావాలా... అని ప్రశ్నించారు. పోడు భూముల పంపిణీ తర్వాత... ఎవరైనా ఇంకా పేదరికంలో ఉంటే దళిత బంధు తరహాలోనే గిరిజన బంధు ప్రకటిస్తామని గిరిజన పెద్దలకు చెప్పామన్నారు. తెలంగాణలో అరవై ఆరు లక్షల ఎకరాల్లో అటవీ భూమి ఉందని ఓ లెక్క ఉంది. దీనిలో పోడును వేరు చేసి ఎలా పంపిణీ చేయాలో విచారణచేశామన్నారు. చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలోనే ఎంక్వయిరీ నడిచిందన్నారు. జిల్లా కలెక్టర్లు ఫైనల్ నివేదిక సిద్ధం చేశారని తెలిపారు. అయితే ప్రతి గ్రామంలో సర్పంచ్, అఖిల పక్షం నేతలు... భవిష్యత్లో పోడు భూముల సమస్య ఉండబోదని ప్రకటిస్తేనే పట్టాలు ఇస్తామన్నారు. ఇకపై అడవులు నరికివేత ఉండబోదంటేనే పదకొండున్నర లక్షల పోడు భూముల పంపిణీకి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని ఛత్తీస్గఢ్ నుంచి గొత్తికోయలనను తీసుకొచ్చి రాత్రికి రాత్రే అడవులను నరికించేస్తున్నారని కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాళ్లు చాలా వైలెంట్గా అటవీ అధికారులను నరికేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారి శ్రీనివాస్ మృతికి ఎవరు బాధ్యులను ప్రశ్నించారు. అలా అధికారులపై దాడు చేయడం కరెక్టేనా అని నిలదీశారు. దాన్ని సమర్థిదామా అన్నారు. అటవీ భూములను కొట్టేసి పట్టాలు ఇవ్వండీ అనేది న్యాయమైన డిమాండ్ కాదన్నారు కేసీఆర్. ప్రభుత్వం దయతలచి ఇస్తే తీసుకోవాలన్నారు. ఫిబ్రవరిలోనే పోడు భూముల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల కోసం తాము పట్టాలు ఇవ్వదలుచుకోలేదన్నారు. ప్రతి ఒక్కరికి లెక్క ప్రకారం భూములు పంపిణీ చేస్తామన్నారు. పోడు భూముల పట్టాతోపాటు... వాళ్లకు విద్యుత్ కెనెక్షన్ ఇచ్చి... రైతు బంధు కూడా ఇస్తామన్నారు. కానీ... పట్టాలు తీసుకునే వాళ్లు భవిష్యత్లో అడవిని కాపాడే కాపాలాదారులు కావాలన్నారు. దీన్నిరాతపూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి వాళ్లు రేపు మళ్లీ అడవిని ఆక్రమిస్తే ఇచ్చిన పట్టా రద్దు చేసే చట్టం తీసుకొస్తామన్నారు. అటవీ అధికారుల దురుసు ప్రవర్తన కూడా ఉంది. దాన్ని కూడా సరిచేస్తున్నామన్నారు. అయితే గతంలో ఇచ్చినవి ఇప్పుడు ఇచ్చేవి మొత్తంగా ఎన్ని ఎకరాల్లో పోడు భూములు ఉన్నాయో తేలాల్సి ఉందన్నారు. పటిష్టమైన లెక్కల చూసి ఇద్దామన్నారు. ఆ లెక్కలను సభలో చర్చించి... ఇకపై గజం భూమిని కూడా ఆక్రమణ కాకుండా చేద్దామన్నారు. సంతకాలు పెట్టేందుకు ముందుకు రాని గ్రామాల్లో పట్టాలు ఇవ్వబోమన్నారు. కొందరు అగ్రకులాలకు చెందిన వ్యక్తులు గిరిజనుల అమ్మాయిలను పెళ్లిళ్లు చేసుకొని దోపిడీ చేస్తున్నారో దాన్ని కూడా అరికట్టాలన్నారు.

# మంత్రి వేములను కలిసి సీఎం కేసిఆర్ కు

# దన్యవాదాలు తెలిపిన ఖాయితీ లంబాడాలు

**హైదరాబాద్**



వాల్మీకి బోయలు, పెద్ద బోయలు, మధుర ఖాయితీ లంబాడాలు, మాలి సహా బేదర్, కిరాతక, నిషాది, భాట్ మధురాలు, చమర్ మధురాలు, చుండువాల్లు, తలయారి కులాలను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీర్మానం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ కు చెందిన మధుర ఖాయితీ లంబాడాలు అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్యమంత్రి కేసిఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్వర్యంలో వీరంతా మంత్రిని కలిసి పుష్ప గుచ్చం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న తమ సమస్యను గుర్తించి అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి కేసిఆర్ కి జీవితకాలం రుణపడి ఉంటామని అన్నారు. వీరంతా ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలానికి చెందిన వారు.

## ఇంటి తాళాలు పగలకొట్టిన బీహారీ

**జగిత్యాల**

జగిత్యాల పట్టణంలోని బాలాజీ నగర్ ( మోతే వాడ) లో తాళం వేసిన ఇంటి తాళాన్ని బీహార్ కు చెందిన సంజీవ్ పగలకొట్టాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంజీవ్ పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## శ్రావణిని పరామర్శించిన ఎంపి అరవింద్

**జగిత్యాల**

జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా రాజీనామా చేసిన డా. బోగ శ్రావణి ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ శుక్రవారం పరామర్శించారు. అరవింద్ మాట్లాడుతూ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ శ్రావణీ మూడేళ్ల పదవి ఉన్నా ఆత్మాభిమానం కోసం రాజీనామ చేసింది. ప్రజా సమస్యలను పరిష్కరిస్తే ఈమెను కించ పరుస్తూ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నాడు. కవిత కు ఏం హోదా ఉందని దేశమంతా తిరిగింది. రాయికల్ మాజీ ఎంపీపీ పడాల తిరుపతి పై వ్యక్తి గత ఆరోపణలు చేసిండు.. ఇపుడు శ్రావణీని ఇబ్బందులకు గురి చేసిండు. ముందు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు సైకియాట్రిస్ట్ డాక్టర్ అవసరం.శ్రావణీ మా పార్టీ కానప్పటికీ మా పార్లమెంట్ బిడ్డ కాబట్టి పరామర్శించాం. అహంకారాన్ని పాతాళ లోకానికి తొక్కే సమయం ముందు ఉంది. మా పూర్తి మద్దతు మీకు ఇస్తాం.. రాజకీయాల కు అతీతంగా పోరాడుతమని అన్నారు. నా ఎన్నికల్లో టీఆరెస్ జెడ్పిటీసీ లు, ఎంపీటీసీ లు పని చేశారు. ఒక సోదరుడిగా వచ్చి కలిశానని అన్నారు.

## భువనగిరి పట్టణంలో ఫుడ్ సేఫ్టీ దాడులు



**యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు భువనగిరి పట్టణంలోని పాలు మరియు పాల పదార్థాలు విక్రయించే షాపులపై తనిఖీలు చేపట్టడం జరిగింది భువనగిరి పట్టణంలో ఉదయం నుండి దాడులు కొనసాగుతున్నాయి పట్టణంలోని పలు పాలపదార్థాలు విక్రయించే షాపులపై కేసులు నమోదు చేశారు కల్తీ మరియు విషపూరితమైన చంకలను వాడుతున్నట్లు దుకాణాల్లో దొరికిన శాంపిల్స్ నిదర్శనం దీంతో వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు కొన్ని శాంపిల్స్ ను హైదరాబాద్ ల్యాబ్ కు పంపిస్తున్నామని వచ్చిన తర్వాత క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు..

## అయిల్ పామ్ సాగులో ప్రగతి

**హైదరాబాద్**

శాసనసభ ప్రశ్నోత్తరాలలో భాగంగా ఆయిల్ పామ్ సాగుపై సభ్యులు గండ్ర వెంకటరమణా రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షా 30,463 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు అవుతోంది. ఈ ఏడాది కాలంలో 62,023 ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగులో ప్రగతి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. 19.32 శాతం నూనె ఉత్పత్తి శాతంతో దేశంలో తెలంగాణ నంబర్ 1. ఆయిల్ పామ్ సాగుకు ధరఖాస్తు చేసుకున్న రైతులకు త్వరితగతిన మొక్కలు, డ్రిప్, ఇతర సాంకేతిక సహకారం అందజేసాం. 1564 ఎకరాలలో పాలమూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు అవుతోంది. 20 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. 2022 - 23 సంవత్సరానికి గాను లక్ష 20 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం. ఆయిల్ పామ్ సాగును అందరూ ప్రోత్సహించాలని అన్నారు.

## వైఎస్ఆర్ ఏఎఫ్ యూ వీసీగా ఆచార్య బన్నోత్ ఆంజనేయ ప్రసాద్

**కడప**



నగరం లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గా ఆచార్య బన్నోత్ ఆంజనేయ ప్రసాద్ నియమితుల య్యారు.గత నెల పాటు ఇన్చార్జి బాధ్యతలు నిర్వ హించిన ఆచార్య పి.ఫజల్ రెహమాన్ స్థానంలో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ను 3 సంవత్సరాల పాటు నియమిస్తూ ఉన్నత విద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు.

# నటుడు అర్జున్ నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ కవిత

**చెన్నై**



ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వహించనున్న సదస్సులో పాల్గొనడానికి చెన్నైలో పర్యటిస్తున్న టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రముఖ నటుడు సినీ హీరో అర్జున్ సర్జ నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్జున్ దంపతులు కల్వకుంట్ల కవితకు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ... చెన్నైలో పర్యటించడం తనకు ఎప్పుడూ ఆనందంగా ఉంటుందని తెలిపారు. తమిళనాడు అస్తిత్వం చాలా గొప్పదని, అక్కడి ప్రజలు స్ఫూర్తిదాయకంగా ఉంటారని అన్నారు. తమిళనాడు ప్రజలు తమ సంస్కృతి భాష చరిత్ర వారసత్వం పట్ల గర్వంగా ఉంటారని, ప్రతి ఒక్కరికి ఆ గౌరవభావం ఉండాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆలోచన తత్వం భారతీయులను ఐక్యంగా ఉంచుతుండడం గర్వంగా ఉందని తెలిపారు. దేశంలోని అతిపెద్ద హనుమాన్ దేవాలయాన్ని నిర్మించినందుకు అర్జున్ కు కవిత అభినందనలు తెలిపారు

# తల్లిదండ్రులను విస్మరించేవారు శిక్షార్హులే

**కోరుట్ల,**



వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ అన్నారు. గురువారం కోరుట్ల పట్టణములో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కౌన్సెలింగ్ కేంద్రం లో కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులకు వయోవృద్ధుల సంరక్షణ చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో కోరుట్ల కు చెందిన ప్రముఖ రక్త దాత కటకం గణేష్ ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ సీనియర్ సిటీజన్స్ అవగాహన పుస్తకాలు ఆవిష్కరించారు. అనంతరం హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ చట్టం సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులైన తల్లిదండ్రులను వేధింపులకు,నిరాదరణకు గురిచేసిన కొడుకులకు,వారసులకు మూడు నెలల నుంచి ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అధికారం ట్రిబ్యునల్ చైర్మన్లు అయిన రెవెన్యూ డివిజనల్ అధికారులకు ఉందన్నారు.కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ లలో ఆర్డీవో వినోద్ కుమార్ వయోవృద్ధుల కేసుల పరిష్కారం లో రాష్ట్రంలోనే నెంబర్ వన్ అధికారిగా నిలిచారన్నారు. జిల్లా కేంద్రంలోసీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా హామీ ఇచ్చారన్నారు.కోరుట్ల డివిజన్ లో ప్రభుత్వం నియమించిన రాజీ అధికారులు పబ్బా శివానందం,గంటేది రాజ్ మోహన్,నల్ల లక్ష్మి నారాయణ లు వయోవృద్ధుల కేసుల రాజీ లో చేస్తున్న కౌన్సిలింగ్ ల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా రాష్ట్ర హోమ్ మినిస్టర్ మహమూద్ అలీ చేతుల మీదుగా ఇటీవల జరిగిన రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆవిర్భావ సదస్సులో ఉత్తమ రాజీ అధికారులుగా అవార్డులు పొందడం ను అభినందించారు. కేంద్రంలో ప్రభుత్వం తరపున వృద్ధాశ్రమ ఏర్పాటు కు మం కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుకు,కోటి నిధులు మంజూరు చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్ కు కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వయోవృద్ధుల చట్టం లో చేసిన సవరణలు సీనియర్ సిటిజన్స్ కు భరోసా నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సి.హన్మంత రెడ్డి,సీనియర్ సిటిజన్స్ కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్,కోశాధికారి నల్ల లక్ష్మినారాయణ, ఉపాద్యాక్షుడు ఎం.డి.సైఫోద్దీన్,మెట్ పల్లి అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సౌడాల కమలాకర్, రాజయ్య,సాజిద్ అలీ,గంగారాం,అనసూయ,లక్ష్మి,తదితరు లు పాల్గొన్నారు.

# బీబీసీపై నిషేధం... సుప్రీంకోర్టు ఆగ్రహం...

**ఢిల్లీ :**



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పై వివాదాస్పద డాక్యుమెంటరీని ప్రసారం చేసిన బీబీసీ కార్యకలాపాలను భారత దేశంలో నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. పూర్తిగా తప్పుడు అవగాహనతో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారని పేర్కొంది. హిందు సేన చీఫ్ విష్ణు గుప్త ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. మోదీపై రెండు భాగాలుగల డాక్యుమెంటరీని బీబీసీ ప్రసారం చేసిన సంగతి తెలిసిందే.బీబీసీ ఈ డాక్యుమెంటరీలో భారత దేశ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిందని విష్ణు గుప్త తన పిటిషన్‌లో ఆరోపించారు. అంతర్జాతీయంగా ఎదుగుతున్న భారత దేశానికి, మోదీకి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర ఫలితమే ఈ డాక్యుమెంటరీ అని పేర్కొన్నారు. మోదీ, భారత్ ఎదుగుదలను భారత దేశ వ్యతిరేక లాబీ, మీడియా, మరీ ముఖ్యంగా బీబీసీ జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు.దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం స్పందిస్తూ, ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. ఈ డాక్యుమెంటరీని ప్రభుత్వం నిషేధించడం సహా ఇతర అంశాలు ప్రత్యేకమైనవని తెలిపింది.

## ఆటో డ్రైవర్ల అందోళన

**హైదరాబాద్**

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ ఛలో అసెంబ్లీకు పిలుపునిచ్చింది. హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ భవన్ నుండి అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో డ్రైవర్లను పోలీసులు అడ్డుకొని , అరెస్ట్ చేసారు. ఐటీయూసీ నాయకుడు వెంకటేశం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడినప్పటి నుండి ఆటో మీటర్ చార్జీలు పెంచలేదు. పెరుగుతున్న నిత్యావసర ధరలు అనుగుణంగా రేట్లు పెంచాలి. ఆర్టీఏ లో స్క్రాప్ విధానాన్ని క్రమబద్దీకరించాలి. పక్క రాష్ట్ర ఏపీ లో ఇస్తున్న వాహన మిత్ర పధకం తరహాలో 10000 ఆర్థిక సహాయం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రవాణా కార్మికులు తగిన గుణపాఠం చెబుతామని అన్నారు.

## మిషన్ భగీరథలో భారీ అవినీతి

**సిద్దిపేట**

సిద్దిపేటలో బిజెపి కార్నర్ మీటింగ్ కి సినీ నటి జీవిత హాజరయ్యారు. జీవిత మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ను గెలిపిస్తే కంట్లో నీళ్ళు మాత్రమే మిగిలాయి కానీ పనులు జరగలేదు. మనం బ్రతకడానికి బీజేపి నీ గెలిపించాలి. సిద్దిపేట లో జరుగుతున్న అరాచకాలు చూస్తుంటే సినిమా విలన్లు కూడా సరిపోరు. మిషన్ భగీరథ పథకంలో అవినీతి జరిగింది. తెలంగాణ రాష్ట్రం బంగారు తెలంగాణగా కాలేదు కానీ కెసిఆర్ కుటుంబం మాత్రమే బంగారు కుటుంబంగా మారిందని ఆరోపించారు.

## షర్మిల ధర్నా

**జనగామ**

జనగామ జిల్లా రఘునాథ్ పల్లి సబ్ స్టేషన్ ముందు జాతీయ రహదారి పై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల ధర్నాకు దిగారు. రాష్ట్రంలో అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ ధర్నా చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు వెంటనే 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ధర్నా నేపథ్యంలో జాతీయ రహదారి పై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

## విద్యుత్ కోసం అన్నదాతల అందోళన

**నల్గొండ**

నల్లగొండ జిల్లా పరిధిలో కరెంటు కోతలపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్, నల్లగొండ, నాగర్జునసాగర్, తిప్పర్థి సహ పలు ప్రాంతల్లో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాత్రి నకిరేకల్ మండలం, కడపర్తి గ్రామంలో రైతులు సబ్ స్టేషన్ ను ముట్టడించగా, శుక్రవారం పలు చోట్ల ధర్నాలు చేపట్టారు. వ్యవసాయ కరెంటును నాలుగు గంటలు కూడా రావడం లేదంటూ రైతుల నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల రైతులకు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

## బడ్జెట్ కు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

**విశాఖపట్నం**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ఏపీ కి అన్యాయం జరిగిందని, ఉత్తరాంధ్ర ,విశాఖ రైల్వే జోన్ కి నిధులు కేటాయింపులోనూ వివక్ష చూపించారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి ఆరోపించారు.కేంద్రబడ్జెట్లో ఉత్తరాంధ్ర జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ రైల్వే డిఆర్ఎం కార్యాల యం వద్ద సీపీఐ నిరసన చేపట్టింది.ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదని, ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో విశాఖ కేంద్రంగా ప్రత్యేక జోన్ ఏర్పాటు కానుందని ఓఎస్డీ ని సైతం నియమించి డి పి ఆర్ ఇచ్చి నేటికి రెండు సంవత్సరాలు గడిచినా దాని అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పోచారం కు జన్మదిన శుభాకాంక్షలు



**హైదరాబాద్**

రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాడు ఆయన ఛాంబర్ లో సీఎం కేసిఆర్ తో కలసి పుష్పగుచ్చాన్ని అందజేసి శాసన సభ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకరరావు, జగదీశ్వర్ రెడ్డి తదితరులతో కలసి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తో కేక్ కట్ చేయించారు. వారు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు శాసనసభలో మంత్రి మరోమారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ‘రైటర్ పద్మభూషణ్’ చిత్ర యూనిట్ ని అభినందించిన కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్



రైటర్ పద్మభూషణ్’ చిత్ర యూనిట్ కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్ అభినందించారు. సుహాస్ కథానాయకుడిగా నటించిన హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘రైటర్ పద్మభూషణ్. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్స్ పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించారు.

ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. తాజాగా కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్ కుమార్.. రైటర్ పద్మభూషణ్ సినిమాతో పాటు సుహాస్, దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్, నిర్మాతలు అనురాగ్‌రెడ్డి, చంద్రూలపై ప్రశంసలు కురిపించారు “రైటర్ పద్మభూషణ్ సినిమాకి చాలా గొప్ప స్పందన వస్తోంది. ఇంత చక్కని సెన్సిబుల్ సినిమాకి ప్రేక్షకుల నుంచి అంతే గొప్ప స్పందన రావడం చాలా అనందంగా వుంది. ప్రివ్యూ షో గ్లింప్స్ చూశాను. ప్రేక్షుల నుంచి వచ్చిన స్పందన నా మనసుని హత్తుకుంది. అతి త్వరలోనే సినిమాని చూస్తాను. ఇంత చక్కటి సినిమాని అందించిన టీం అందరికీ అభినందనలు. సినిమా ఇంకా చూడని వారు.. ప్లీజ్ గో అండ్ వాచ్ రైటర్ పద్మభూషణ్” అని కోరారు.

‘రైటర్ పద్మభూషణ్’ ఘన విజయం సాధించి ప్రస్తుతం అన్ని చోట్ల సక్సెస్ఫుల్ గా రన్ అవుతోంది.




# ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై వి.జె.సన్నీ హీరోగా నూతన చిత్రం ప్రారంభం!!



వినోద ప్రధానమైన చిత్రాలు అందించాలన్న సంకల్పంతో , అభిరుచితో టెక్సాస్ కు చెందిన ఫుల్ మూన్ ప్రొడక్షన్స్ అనే నూతన సంస్థ చలనచిత్ర ప్రపంచంలో సరికొత్త సంచలనాలు సృష్టించడానికి సిద్ధమైంది. అందులో భాగంగా ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై తొలి ప్రయత్నంగా బిగ్ బాస్ ఫేమ్ , ఏటియమ్ వెబ్ సిరీస్ తో నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వి.జె.సన్నీ హీరోగా ఓ చిత్రాన్ని ఫిబ్రవరి 9న గ్రాండ్ గా షూటింగ్ ప్రారంభించారు. శివన్నారాయణ, శైలజ ప్రియ, సప్తగిరి మరియు రేఖ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

టాలెంటెడ్ రైటర్ ‘సంజయ్’ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. వైవిధ్యమైన కథలను చిత్రీకరించడంలో పేరు పొందిన వి. జయశంకర్ దర్శకత్వ పర్యవేక్షణలో ఒక అద్భుతమైన వినోదాత్మక చిత్రంగా రూపొందనుంది.

ఈ సందర్భంగా ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ సంస్థ అధినేతలు మాట్లాడుతూ...“ వి.జె. సన్నీ హీరోగా ఈ రోజు మా చిత్రాన్ని గ్రాండ్ గా ప్రారంభించాం. ఈ రోజు నుండి కంటిన్యూ షెడ్యూల్ ఉంటుంది. సింగిల్ షెడ్యూల్ లో సినిమాను కంప్లీట్ చేయడానికి ప్లాన్ చేశాం . ఎంతో ప్రతిభావంతులైన నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు మా చిత్రానికి పని చేస్తున్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులు, దర్శకులు మరియు నిర్మాతలను కనెక్ట్ చేసే టాలెంట్-స్కౌటింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన ఊబీనిబి4ఓతినిబి తో చేతులు కలపడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ భాగస్వామ్యం ద్వారా ఎంతో మంది ప్రతిభావంతులను పరిశ్రమకు పరిచయం చేయడంతో పాటు వారి ద్వారా మరిన్ని మంచి చిత్రాలు వచ్చే అవకాశం ఉంటుంది. ఎంతో అభిరుచితో ప్రారంభించిన మా సంస్థ నుండి మంచి చిత్రాలు చేయనున్నాం. త్వరలో మా చిత్రానికి సంబంధించిన టైటిల్ తో పాటు ఇతర వివరాలు వెల్లడిస్తాం“ అన్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః శ్రీనివాస్ రెడ్డి, ఎడిటర్ః కార్తీక్ శ్రీనివాస్; సంగీతంః మదీన్; ఆర్ట్ డైరెక్టర్ః రాజీవ్ నాయర్; చీఫ్ కో-డైరెక్టర్ః చిన్న; కో -డైరెక్టర్ః సంతోష్ కృష్ణ; అసోసియేట్ డైరెక్టర్ః యశ్వంత్; అసిస్టెంట్ డైరెక్టర్ః యష్ ; పిఆర్ ఓః లక్ష్మీగణపతి- వంగాల కుమారస్వామి; నిర్మాణంః ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ ; దర్శకత్వ పర్యవేక్షణః వి.జయశంకర్;

# శాకుంతలం’... ఏప్రిల్ 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



శకుంతలగా బ్యూటీఫుల్ హీరోయిన్ సమంత ..దుష్యంత మహారాజుగా దేవ్ మోహన్ నటిస్తోన్న పౌరాణిక ప్రేమ కథా చిత్రం ‘శాకుంతలం’. ప్యాషనేట్ ఎపిక్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ ఎపిక్ లవ్ స్టోరి ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 14న రిలీజ్ అవుతుంది. సినిమా అనేది లార్జర్ దేన్ లైఫ్‌గా ఉండాలంటూ ప్రతి ఫ్రేమ్‌ను అద్భుతంగా తెరకెక్కించే డైరెక్టర్ గుణశేఖర్ కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా శాకుంతలంను రూపొందిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెలోడి బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

విజువల్ వండర్‌గా త్రీడీ టెక్నాలజీతో తెలుగు, హిందీ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో శాకుంతలం సినిమా విడుదలవుతుంది. ఈ మూవీ ప్రమోషన్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే రిలీజైన ట్రైలర్, ‘మల్లికా మల్లికా..’ సాంగ్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌ను క్రియేట్ చేశాయి.

శాకుంతలం చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందించారు. శేఖర్ వి.జోసెఫ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. మణి శర్మ సంగీతం అందిస్తోన్న ఈ చిత్రాన్ని విజువల్‌గానే కాకుండా మ్యూజికల్‌గానూ ఆడియెన్స్‌కు ఆమేజింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వటానికి రీ రికార్డింగ్‌ను బుడాపెస్ట్, హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్ వర్క్ చేశారు.

సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన శాకుంతలం చిత్రంలో డా.ఎం.మోహన్ బాబు, ప్రకాష్ రాజ్, మధుబాల, గౌతమి, అదితి బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా కీలక పాత్రలను పోషించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ యువరాజు భరతుడి పాత్రలో నటించటం ప్రధాన ఆకర్షణ కానుంది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950